ప్రజాశక్తి

శనివారం 8 మార్చి 2025 **12 పేజీలు**



తిరుపతి

చిత్తూరు

'ధర్నా'లోనే మహిళా దినోత్సవ వేడుక

బ్యాంకుల్లో పోస్టులు భర్తీ చేయాలి

- ఐదు రోజులే పనిదినాలు కల్పించాలి
- గత ఏడాది హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'బ్యాంకుల్లో అన్ని క్యాడర్లలోనూ పోస్టులు భర్తీ చేయాలని, వారంలో ఐదు రోజులే పని దినాలు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని' యుఎఫ్‌బియు కన్వీనర్ పి.విజయభాస్కర్, టిబిఇసిసి ప్రధాన కార్యదర్శి జె.ధన్వంత్‌కుమార్ డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యుఎఫ్‌బియు) పిలుపు మేరకు టిపి ఏరియాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట శుక్రవారం సాయంత్రం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది మార్చి 6వ తేదీ తమ డిమాండ్లను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే ఈనెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె చేస్తామన్నారు. ఈ సమ్మెలో 2లో

ఓటేరు చెరువును కాపాడతాం

- ఆక్రమణదారులపై కేసులు పెట్టాలి
- ప్రజలపక్షాన వామపక్షాల పోరాటం
- మీడియాతో సిపిఎం, సిపిఐ నేతలు

2లో

ఓటేరు చెరువు ఆక్రమణలను గురు, శుక్రవారాల్లో పరిశీలించిన అనంతరం ఎస్వీ వ్యాఖ్యలపై వామపక్షాల ప్రెస్‌మీట్

International Women's Day

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

కనులు తెరిసిన క్షణం నుండి...
బంధం కోసం బాధ్యత కోసం...
కుటుంబం కోసం అందర్ని
కనుపాపలా తలచి
ఆత్మీయతని పంచి తనవారి
కోసం అహర్నిశలు కష్టించి
వారి కళల్ని పోషించి,
అవమానాన్ని సహించి,
వారి భవిష్యత్తు గురించి,
తన ఇంటిని నందనవనం
చేసే స్త్రీకి పాదాభివందనం.

చిత్తూరు జిల్లా మహిళా సమాఖ్య
చిత్తూరు జిల్లా.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం,
పట్టుదలతో ప్రతి అవకాశాన్ని విజయంగా
మలచుకోవాలని అన్ని రంగాల్లో మహిళలు
మరింత చైతన్యవంతులై ముందుకు సాగాలని కోరుకుంటూ...
మహిళామణులందరికీ
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

Assure you the best education in
DEVI BALAMANDIR
ENGLISH MEDIUM HIGH SCHOOL
Santhapet, CHITTOOR- 4. Tel : 08572-248702

Highlights of the school
- Daily Bhagavath Geetha Classes
- Dance Classes by Qualified Dance Teacher
- Karate by Qualified & Experienced Master
- Leadership & Social Skills
- Yoga Classes for All
- Presentation & Commmunication Skills
- Abacus Classes from III to VII Classes

B.SUJATHA, M.A., B.Ed.,
Correspondent & Headmistress

ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ

అడవికి నిప్పు-మనిషికి ముప్పు

అడవులలో అగ్గి పడుటవలన తరతరాలుగా పెంచి పోషించిన వృక్షజాతి మరియు జంతుజాతి నశించిపోవును కావున రాబోవు వేసవి కాలంలో అడవిలో అగ్గిపడకుండా అటవీశాఖకు సహకరించ ప్రార్థన!

అడవిలో అగ్గి నివారణకు క్రిందివాటిని నిషేధించడమైనది.

అడవిలో నిప్పు రగిలించు పదార్థము తీసుకెళ్ళుట.
అడవిలో వంట చేయుట, అగ్గిపెట్టెలు తీసుకొనిపోవుట
గొర్రెలకాపర్లు అడవిలో ఎండుగడ్డిని తగులబెట్టడం
అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం నిప్పు రగిలించుట

అడవులలో నిప్పు నివారణకు సహకరించండి !
అడవులను మరియు వన్యప్రాణులను కాపాడండి !!
అటవీశాఖకు సహకరించండి-తగిన పారితోషికం పొందండి !!!

అడవిలో
అగ్గిపెట్టినవారికి

District Forest Officer, Chittoor District

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతినీ
ఆర్థికాభివృద్ధికి కృషిచేసినందుకు
గాను పంచాయతీ సర్పంచి శ్రీమతి బొల్లినేని సుభాషిణి గారిని కేంద్ర ప్రభుత్వం
ఉత్తమ పురష్కారంతో సత్కరించింది. ఈ పురస్కారాన్ని కేంద్ర
పంచాయతీరాజ్ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్‌సింగ్ (లాలన్‌సింగ్) చేతుల మీదుగా
అందుకోవడం జరిగింది. ఈ పురస్కారం పంచాయతీకి
రావడానికి సహకరించినఅధికారులకు, ప్రజాప్రతినిధులకు,
కార్మికులకు మరియు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు

పంచాయతీ సిబ్బంది
చెర్లోపల్లి, తిరుపతి రూరల్ మండలం

ఓటేరు చెరువును కాపాడతాం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'ఎంతో ఘన చరిత్ర కలిగిన ఓటేరు చెరువు ప్రభుత్వానిదేనని తీర్పులు వచ్చినా కబ్జాకు పాల్పడుతున్నారని, ఆక్రమణకు పాల్పడిన వారిపై కేసులు పెట్టాలని, ప్రజల పక్షాన పోరాడి ఓటేరు చెరువును కాపాడతాం' అని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి ఉద్ఘాటించారు. గురు, శుక్రవారాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో సిపిఎం, సిపిఐ బృందాలు చెరువు ఆక్రమణలను పరిశీలించి ధర్నాలు నిర్వహించాయి. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చెరువును కాపాడాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ ఎస్సీవీ నాయుడు వామపక్షాలపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఓటేరు చెరువు తమదని శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవీ నాయుడు చెబుతుంటే, అదే చెరువు కబ్జాకు గురయ్యిందని ప్రస్తుత ఎంఎల్‌ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పారన్నారు. దీనిపై మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవీ నాయుడు స్పందించాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఎంఎల్‌ఎ పులివర్తి నాని కార్యాలయానికి సమీపంలోనే ఇంత దారుణం జరుగుతున్నా, కబ్జా విషయంలో స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ అవసరాలకు, భావితరాల కోసం చెరువులను కాపాడుకోవాలన్నారు. తన భూమి 15 ఎకరాలు ఉందని, ఐదు ఎకరాలు రోడ్డుకు పోయిందని ఎస్సీవీ నాయుడు చెబుతున్నారని, అయితే రోడ్డు నష్టపరిహారంగా ఎంత నగదు ముట్టిందో బయటకు చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో అటవీ భూములను కబ్జా చేశారని విమర్శలు చేసిన టిడిపి, నేడు అదే బాటలో నడుస్తూ చెరువుల కబ్జాకు పాల్పడుతోందన్నారు. వామపక్షాలపై ఎస్సీవీ నాయుడు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం బృందం

చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ కబ్జాకు గురికాకుండా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఓటేరు చెరువు పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ ఓటేరు చెరువును కాపాడాల్సిన ప్రథమ కర్తవ్యం వామపక్షాల కన్నా, ప్రభుత్వ అధికారులకే ఉందన్నారు. చెరువులో మట్టి తోలిన వారిపై కేసులు పెడితే చెరువు కబ్జా వెనుక ఉన్నవారు బయటకు వస్తారన్నారు. వెయ్యి కోట్ల విలువైన ఓటేరు చెరువు భూమిని రేయింబవళ్లు మట్టితోలి చెరువు భౌగోళిక స్వరూపాన్నే మార్చేస్తుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఓటేరు చెరువును కాపాడకోవడంలో తమ వెనుక ప్రజలు ఉన్నారన్నారు. తిరుపతి చుట్టుపక్కల ఉన్న చెరువులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులపై ఉందన్నారు. రైతు సంఘం నాయకులు మంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర గలిగిన ఓటేరు చెరువు ప్రభుత్వానికి సంబంధించినదని ఇప్పటికే పలుమార్లు కోర్టు ద్వారా నిరూపితమైందన్నారు. ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య, వామపక్షాల నాయకులు విశ్వనాథ, చిన్నం పెంచలయ్య, జయచంద్ర, కేశారి రాధాకృష్ణ, గోవిందయ్య పాల్గొన్నారు.

బ్యాంకుల్లో పోస్టులు భర్తీ చేయాలి

దాదాపు 9 లక్షల మంది ఉద్యోగులు పాల్గొంటారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు పిలిచి తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని కేక్ కట్ చేసి మహిళలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జనార్దన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలత, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్, మహేష్ బాబు, నందకుమార్, పవన్ కుమార్, శంకర్ రావు ,లక్ష్మీపతి, నటరాజ్ పాల్గొన్నారు.

మంగళంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం: సుధారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం ప్రాంతంలోని అన్ని హ్యాబిటేషన్స్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి హామీ ఇచ్చారు. మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు టిడిపి యువ నాయకులు మంగళం వినోద్, మంగళం పంచాయతీ టీడీపీ యువ నాయకులు సతీష్(మంగళం నాని) ఆధ్వర్యంలో భారీ ఎత్తున గజమాలతో పులివర్తి సుధా రెడ్డికి స్వాగతం పలికి పంచాయతీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ స్థలాలలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు రెగ్యులరైజేషన్ ద్వారా స్థానిక ప్రజలకు హక్కులు కల్పించనున్నామన్నారు. సిసి రోడ్లు, సీసీ డ్రైన్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి తెలుగు గంగ నీటిని అందించడానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, కార్యదర్శి గోపీనాథ్, టిడిపి పంచాయతీ కమిటీ అధ్యక్షులు జడారెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్ చరిత్ర నా దగ్గర ఉంది : ఎస్సీవీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఓటేరు చెరువుకు, శ్రీకాళహస్తి రైతుల భూములకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తెలిపారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని శ్రీకాళహస్తి రైతుల కడుపు కొట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఓటేరు చెరువు అంశాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావిస్తూ తనపై ఆరోపణలు చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. ఇకపై ప్రతివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అవినీతి వ్యవహారాలను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పర్మిషన్ తో మీడియాకు వెల్లడిస్తామని, టిడిపిని, శ్రీకాళహస్తి ప్రజల్ని కాపాడుకోవడమే తమ లక్ష్యం అన్నారు. బొజ్జల సుధీర్ చరిత్ర తన దగ్గర ఉందన్నారు.

సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మరమ్మత్తులకు సంబంధించిన పనులను నాణ్యతతో చేపట్టాలని, అలాగే వసతి గృహాల మరమ్మత్తులకు సంబంధించిన అంచనాల ప్రతిపాదనలు నిర్దేశించిన గడువులోపు పంపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నందు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు సంబంధించి సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో, అలాగే మహాత్మా జ్యోతీ రావు పూలే, డా.బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల అధికారులతో, ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులు మరుగుదొడ్ల రిపేర్ రన్నింగ్ వాటర్ ఉండేలా ఏర్పాటు, ప్రతి కొళాయికి ట్యాప్ ఉండేలా, ట్యూబ్ లైట్లు ఏర్పాటు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఎల్ఈడి బల్బుల

ఏర్పాటు, కిటికీలకు దోమల మెష్, అన్ని గదులకు తలుపులు, గదులలో లీకేజ్ లేకుండా మరమ్మత్తులు, ఫ్లోరింగ్ మరమ్మత్తులు, ఆర్వో త్రాగు నీటి ప్లాంట్ వంటి మరమ్మత్తులు పనులను నాణ్యతగా ఎలాంటి లోపాలు లేకుండా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రం కుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీ ఈడబ్ల్యుఐడీసీ బాల సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులపై సమీక్ష

ఎండి పుత్తూరు నుంచి మంగళం వరకూ టిటిడి నిధులతో వేసే పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్యతో కలిసి టిటిడి పైప్‌లైన్ పనులపై సమన్వయ సమావేశం నిర్వహించారు. భవిష్యత్‌లో టిటిడి సంస్థలకు, కార్పొరేషన్‌కు మంచినీటి సరఫరా కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

నగరంలో సిసి కెమెరాల ఏర్పాటు

తిరుపతి నగరంలోని ఏ ప్రాంతంలో ఏమి జరిగినా తెలిసేలా అన్ని ప్రాంతాల్లో సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భాగంగా నగరంలో సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను శుక్రవారం ఉదయం స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. పలు మార్పులను అధికారులకు సూచించారు.

ఎస్‌విఎంసిలో మహిళలకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎస్ వి వైద్య కళాశాల, ఏపీ జెఏసి సంయుక్తంగా ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడలు నిర్వహించారు. ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ చంద్రశేఖరన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శాప్ ఛైర్మన్ ఏ రవి నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. అందులో ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, అహర్నిశలు ప్రభుత్వం కోసం ప్రభుత్వ పథకాల కోసం, వారి శ్రమతో ప్రజలకు సేవలు అందిస్తున్నారు అని పేర్కొన్నారు. అటువిడుపుగా ఇలాంటి క్రీడలు నిర్వహించడం వల్ల మానసికంగా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్ అతావుల్లా, ఏపీ జేఏసీ తిరుపతి ఛైర్మన్ సురేష్ బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ గిరిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల పత్రాలు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎస్వీ వైద్య కళాశాల వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్, ఆధ్వర్యంలో గత నెలలో విడుదలైన నోటిఫికేషన్, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలు ఇంకా పరిశీలనలో ఉన్నందున , సవరణల కోసం తొలి జాబితా, వారం రోజుల తర్వాత విడుదల చేయడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి వివరాల కొరకు విడుదల అయిన తర్వాత ఎస్ వి వైద్య కళాశాల వెబ్ సైట్ నందు సంబంధిత జిల్లా వెబ్సైట్ నందు చూసుకోవాలని పేర్కొన్నారు.

11న కుప్పంలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కుప్పంలో 11న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళా ముఖ్యంగా చిత్తూరు, కుప్పం ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు ఉద్దేశించారు. ఈ మేళాలో సౌరశక్తి, తయారీ, రిటైల్, ఎలక్ట్రానిక్స్, టెలికాం, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, విద్యా రంగాల్లో 500కి పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు 10, 12 తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. లేదా డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఉద్యోగాలకు నియమించే అవకాశం ఉంటుంది. వేతన శ్రేణి 15వేల నుంచి 80వేల వరకూ అవకాశం ఉంది.

ఏపీపీజీసెట్ కన్వీనర్ కేంద్రం ముట్టడి

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న పీజీ ప్రవేశాలకు నిర్వహిస్తున్న కామన్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలని శుక్రవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీలోని కన్వీనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కామన్ ప్రవేశ పరీక్ష వలన రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని, తరగతి గదులు ఖాళీగా దర్శనమిస్తున్నాయని, ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వలన రాష్ట్రంలో ఉన్నత విద్య పూర్తిగా నాశనం అయిందని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష వలన యూనివర్సిటీలకు ఆదాయాలు తగ్గిపోయాయని, విద్యార్థులు లేకపోవడం వల్ల పీహెచ్డీ చేస్తున్న పరిశోధక విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయని, ప్రస్తుతం పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు ఉద్యోగాలు ఎప్పుడు ఉంటాయో ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. పిజిసెట్ కన్వీనర్ స్పందిస్తూ మీ అభ్యర్థనను దష్టిలో ఉంచుకొని ఈ పీజీ సెట్ లో ఉన్న సమస్యలను నేరుగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల సమన్వయకర్త అశోక్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్న, బిసిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలేష్, జిఎన్ఎస్ వ్యవస్థాపకుడు శివ శంకర్ నాయక్, నల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు సుందర్రాజు, జెబీఎస్ఎఫ్ కన్వీనర్ భార్గవ్ సాయి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్,ప్రవీణ్ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, ఏఐఎస్ఎ జిల్లా అధ్యక్షుడు రంజిత్ నాయకులు చంద్రనాయక్, ఓం రాజులు పాల్గొన్నారు.

34 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల పరిధిలోని కడప జిల్లా బద్వేలు అటవీ సరిహద్దు ప్రాంతంలో 35 లక్షల విలువ చేసే 34 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకొని ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. ఆర్ ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పి నరేష్ బృందం గురువారం నుండి బద్వేలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. సి రామాపురం సమీపంలో ఎద్దులబోడు వద్ద రెండు మోటారు సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు కనిపించారని, వీరు టాస్క్ ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది వెంబడించి ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారన్నారు. పట్టుబడిన ముగ్గురు కడప జిల్లాకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వారి నుంచి మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దుంగలతో సహా స్మగ్లర్లను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, పురిటిపాలెం గ్రామ సమీపంలోని పంబలేరు కాలువలో గుర్తు తెలియని యువకుడి మృత దేహం గుర్తించారు. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. మృతుడు వయస్సు సుమారు 30 నుండి 35 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడు నల్లని ప్యాంటు, ఫుల్ హాండ్స్ గడుల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. సుమారు 3-4 రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చు అన్నారు. మృత దేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఆచూకీ తెలిసినవారు గూడూరు రూరల్ పోలీస్ వారికి 9440796344 నెంబరుకు తెలపాలన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర హెచ్చరించారు. చిత్తూరు నగరపాలక కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ ఇంజనీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ సంబంధించి లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు వార్డుల్లో పర్యటించి గుర్తించి ఆపడమే కాకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అక్రమ కట్టడాలు, రోడ్ల ఆక్రమణలతో పాటు మున్సిపల్ స్థలాలు ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే సంబంధిత సెక్రటరీలపై చర్యలు తప్పవన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపి శుభప్రద, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు కూలీలు మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- రేణిగుంట, పెళ్లకూరు: గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని యోగానంద కళాశాల సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. డివైడర్ల మధ్యలో రోడ్డు పనులు చేస్తున్న వారిని వాహనం ఢీకొని డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న రోడ్డుపైకి మినీ లారీ దూసుకు వెళ్లింది. ప్రమాద ఘటన స్థలంలో రమణ మ్మ మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తిరుపాల్ మృతి చెందాడు. శైలజ, సరోజమ్మ, సుక్కమ్మ గాయాలు పాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని పెళ్లకూరు మండలం, నల్లబల్లి పంచాయతీ భీమ వరానికి చెందిన కూలీలుగా గుర్తించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజుల మండ్యం పోలీసులు క్షతగాత్రులను రుయా ఆసుపత్రికి తరలించారు. గాజులమండ్యం ఎస్ఐ పివి సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదుల స్వీకరణ నిర్వహించనున్నారు. చిత్తూరు నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలపై చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 నుండి11గంటల మధ్య వినతులు సమర్పించవచ్చని తెలిపారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు వినతులు స్వీకరిస్తారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

కేజీ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట టౌన్ ప్రభుత్వ బాలుర హై స్కూల్ పక్కన తహశీల్దారు కార్యాలయానికి వెళ్లే దారి హిందూ శ్మశాన వాటిక వద్ద గంజాయి అమ్ముతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్పి ఆధ్వర్యంలో రేణిగుంట డీఎస్పీ వై శ్రీనివాసరావు పర్యవేక్షణలో రేణిగుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐ శరత్ చంద్ర , ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది సాయంతో శుక్రవారం పట్టుకున్నారు. నిందితుల నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండు నిమిత్తం రేణిగుంట పోలీసులు తిరుపతి కోర్టుకు తరలించారు.

దొరస్వామి నాయుడుకి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : పీఈఎస్ విద్యాసంస్థల అధినేత డాక్టరు ఎంఆర్ దొరస్వామి నాయుడు భౌతిక దేహానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నివాళులు అర్పించారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించామని వాణిజ్య విభాగ అధ్యక్షులు భాష్యం వంశి చౌదరి తెలిపారు. శుక్రవారం మండలం లోని గుంతూరు లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో వారికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వారి విగ్రహాలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం వల్ల వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

పబ్లిక్ నోటీస్

(డాక్యుమెంటు దారిపోయినది)

శ్రీ వి జి సుమన్ ప్రసాద్, S/o వి గిరిధర గోపాల్, లక్ష్మీనగర్ కాలనీ, చిత్తూరు టౌన్, అను వారు ఓవర్ డ్రాఫ్ట్ లోను నిమిత్తం నా క్లైయింట్ **ఐసిఐసిఐ బ్యాంక్** (ICICI BANK Limited) **వారిని** సంప్రదించి యున్నారు. అందుకు గాను ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని అడమానం పెట్టదలిచారు. కాగా సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ మూల పత్రము **డాక్యుమెంటు నెం.6005/2015, తేది 27.11.2015** చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌నందు రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు దారి పోయినదనియు, సదరు డాక్యుమెంటు ఎంత వెతికినా దొరకలేదని ఆయన తెలిపి ఉన్నారు. ఈ విషయమై కాణిపాకం పోలీస్ స్టేషన్ నందు కంప్లైయింట్ చేసి నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్‌కూడా పొంది వున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖల ఆస్తి పై ఎవరికైనా ఏ విధమైన హక్కులు గాని,అడమానములు, అగ్రిమెంట్లు, క్లైయిములు,కోర్టు అటాచ్‌మెంట్లు, ఇంకేదైనా అభ్యంతరములు ఉన్న యెడల నాకు గాని లేక పై తెలిపిన ఐసిఐసిఐ బ్యాంక్, చిత్తూరు మెయిన్ బ్రాంచ్ లేక కాణిపాకం పోలీస్ స్టేషన్ వారికి గాని తెలప వలెను. అట్లు తెలపిన వారికి తగిన పారి తోషకము ఇవ్వబడును.

ఎం.చంద్ర శేఖర్ రెడ్డి,
న్యాయవాది, సెల్: 9440028397

150 మందికి వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: 150 మందికి వైద్య పరీక్షలు చేశామని ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆవరణలో బ్యాంకు, రత్నం మెమోరియల్ ఆసుపత్రి ఉమ్మడిగా మహిళా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తు వైద్య శిబిరం నిర్వచించారు. ఈ సందర్భంగా బ్యాంకు చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు మాట్లాడుతూ 150 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారని వీరిని పరీక్షించి తగిన మందులు అందించారని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఇకపై సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అందుబాటులో భారతీయ స్టేట్ బ్యాంక్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి సహిత రత్నం ఆస్పత్రి మేనేజర్ మోహన్ కుమార్, రాజు వేలు, ప్రసన్న, స్వాతి, పూజ బ్యాంక్ సిబ్బంది వంశీ, సతీష్ పలువురు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్ట్ కృష్ణమూర్తి సేవలకు ప్రశంస

ప్రజాశక్తి- చౌడేపల్లి:

ఇటీవల తపాలా శాఖలో ఉద్యోగ విరమణ పొందిన పోస్ట్ కృష్ణమూర్తి ఇంటిని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం సందర్శిం చారు. కృష్ణమూర్తి దంపతులను సన్మానించారు. ఉద్యోగ విరమణ వయసుకే కాని మనసుకు కాదన్నారు. పోస్ట్ మ్యాన్‌గా కృష్ణమూర్తి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డప్ప, జెడ్‌పిటిసి దామోదర్ రాజు, చౌడేపల్లి మాజీ ఎంపీపీలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, ఆస్పత్రి కమిటీ మాజీ ఛైర్మన్ కళ్యాణ్, భరత్, వైసిపి నాయకులు కృష్ణమూర్తి , కొండవీటి నాగభూషణం, కదిరి అహ్మద్, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

International Women's Day

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం, పట్టుదలతో
ప్రతి అవకాశాన్ని విజయంగా మలచుకోవాలని
అన్ని రంగాల్లో మహిళలు
మరింత చైతన్యవంతులై
ముందుకు సాగాలని కోరుకుంటూ...
మహిళామణులందరికీ
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

రాధారాణి, ఎ.ఓ
ఉద్యానవనశాఖా అధికారి
కె.వి.బి.పురం మండలం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

International Women's Day

మాతృమూర్తిగా,
సోదరిగా,
ధర్మపత్నిగా, సృష్టిలో
అమృతమూర్తిగా,
స్త్రీని గౌరవించుదాం,
తద్వారా సమాజాన్ని
గౌరవిద్దాం.

ఉపాధ్యాయులు
L.A సాగరం, ఉన్నత పాఠశాల,
నాయుడుపేట, తిరుపతి జిల్లా.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

PALAMANER MUNICIPALITY
పలమనేరు పురపాలక సంఘం
సత్యమేవజయతే

MEPMA A.P

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం, పట్టుదలతో
ప్రతి అవకాశాన్ని విజయంగా మలచుకోవాలని
అన్ని రంగాల్లో మహిళలు మరింత చైతన్యవంతులై
ముందుకు సాగాలని కోరుకుంటూ...మహిళామణులందరికీ
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

సూర్యోదయ పట్టణ మహిళా సమాఖ్య, పలమనేరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం, పట్టుదలతో
ప్రతి అవకాశాన్ని విజయంగా మలచుకోవాలని
అన్ని రంగాల్లో మహిళలు
మరింత చైతన్యవంతులై
ముందుకు సాగాలని కోరుకుంటూ...
మహిళామణులందరికీ
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

యాచమనేని ఉషారాణి,
తెలుగుదేశం మహిళ మండల అధ్యక్షురాలు
బుచ్చినాయుడుకండ్రిగ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

International Women's Day

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం, పట్టుదలతో
ప్రతి అవకాశాన్ని విజయంగా మలచుకోవాలని
అన్ని రంగాల్లో మహిళలు
మరింత చైతన్యవంతులై
ముందుకు సాగాలని కోరుకుంటూ...
మహిళామణులందరికీ
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

బుక్కాపట్నం గీత
హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్
గంగాధర నెల్లూరు మండలం.

నాయీ బ్రాహ్మణుల ధర్నా

ప్రజాశక్తి -పుంగనూరు: 'మా పని మేము చేసుకుంటూ జీవనం చేసుకుంటున్న తమపై దాడి చేసి మంగళ వాయిద్యాలు ధ్వంసం చేశారని, వారిపై పోలీసులు ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని ఇది చాలా దారుణమైన సంఘటనని నాయీ బ్రాహ్మణ సంగం అధ్యక్షుడు హేమంత్ అన్నారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లి శుభకార్యంలో మంగళవాయిద్యాలు చేస్తున్న నాయిబ్రాహ్మణులపై దాడి చేసి , డ్రమ్ములను పగులగొట్టిన పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన నాయిబ్రాహ్మణులు గురువారం మండలంలోని బుర్రావారిపల్లెలో వివాహ కార్యక్రమానికి శంకరప్ప బృందం వెళ్లింది. పెళ్లి జరుగుతుండగా చిన్నరెడ్డెప్ప అనే వ్యక్తి వచ్చి దుర్భాషలాడుతూ శంకరప్ప బృందంపై దాడి చేసి డ్రమ్ములను పగులగొట్టాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అన్నారు. వెంటనే వారిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మెగా డిఎస్సి 2025 పరీక్షకు బీసి, ఈ డబ్ల్యూ ఎస్ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ నిర్వహిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌కె రబ్బానీ బాష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి, చిత్తూరు కార్యాలయంలో కాని, లేదా ఫోన్ నెంబర్ 9177429494 లను సంప్రదించాలని సూచించారు.

రాజధాని పాపం జగన్‌దే..

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పాపం జగన్మోహన్ రెడ్డి ఇదేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. శుక్రవారం నిర్వహించిన బిజెపి నాయకుల సమావేశంలో పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గౌరవ సభను గౌరవ సభగా వైసిపి ప్రభుత్వం మార్చిందన్నారు. స్థానిక మురుకంబట్టిలో చిత్తూరు నార్త్ మండల అధ్యక్షులు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

'టీడిపి తోనే మహిళాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - రామకుప్పం: మహిళల్లో చైతన్యం తీసుకురావాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి ,మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ శక్తి భవనంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలకు పూలమాలలు వేసి, దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఈ సైకిల్ లను సబ్సిడీ ద్వారా పొందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 44 వేల రూపాయలు విలువచేసే ఈ సైకిల్ సబ్సిడీ ద్వారా 9 వేల రూపాయలకే 50 మంది లబ్ధిదారులకు అందజేశామన్నారు. రానున్న రోజుల్లో దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహులు , రామ్మూర్తి, చిన్నకృష్ణ, సీతాపతి, హరీష్, కామరాజ్నాయక్, గంట్లప్ప గౌడు, నాగభూషణం,సుబ్రి ,మనోహర్,బాలరాజు, రఫీ , వెంకటరమణ, పద్మమ్మ ,ఏపీఎం శ్రీనివాస మూర్తి, ఐ కె పి సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలీశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.4,42,839

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : మొగిలి శ్వర స్వామి ఆలయ హుండీ లెక్కించినట్టు ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్ ఆలయ పరిశీలకు రాలు సుమనప్రియ తెలిపారు. శుక్రవారం మండలంలోని మొగిలి గ్రామంలో శ్రీ కామాక్షి సమేత మొగులేశ్వర స్వామి ఆలయంలో గత 40 రోజులకు హుండీలో 3,82,541 రూపాయలు, అన్నదానం రూ.60,298 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి మునిరాజులు, ఆలయ సిబ్బంది శరవణ, లోకనాథ్, మధు, కమలనాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, మంజు, ధనంజయ పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ ఛైర్మన్‌కు పరామర్శ

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు మాజీ మున్సిపల్ ఛైర్మన్ ప్రకృద్దీన్ షరీఫ్ ఇటీవల అనారోగ్యం గురి కావడంతో మదనపల్లి మోడ్రన్ ఆసుపత్రి లో చికిత్స పొందుతుండగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం వెళ్లి పరామర్శించారు. పుంగనూరు మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి వివిధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పకృద్దీన్ షరీఫ్ ఆస్పత్రికి ఆరోగ్య విషయాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సలు అందించేలా చూడాలని వైద్యులకు సూచించారు. అలాగే మండలంలోని కుమ్మర నత్తం పంచాయతీ కొండ సముద్రం మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఇటీవల కుమార్తె వివాహం నిర్వహించగా వారి ఇంటికి వెళ్లారు. ఆరడిగుంట పంచాయతీ కీలకరి గ్రామంలో రామాలయం, బోదేవారి పల్లి పంచాయతీ కోట గడ్డ గ్రామంలో రామాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. చౌడేపల్లి మండలంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్సీ తిప్పారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ భాష, నాగభూషణం, అమ్ము, కోటగడ్డ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైట్ ఫీల్డ్ కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు నగరంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు బిగ్ టీవీ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్, గుండె, కిడ్నీ, షుగర్ గ్యాస్ట్రో ఎంట్రా లజీ, న్యూరాలజీ, సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం ఆదివారం 10 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యశాల స్కీం ద్వారా అర్హులైన వారికి ఉచిత ఆపరేషన్ చేస్తామని పేర్కొన్నారు.

పేదరికంలో పుట్టి..ఉన్నత స్థితికి ఎస్ఐ స్వర్ణతేజ

ప్రజాశక్తి -పలమనేరు: పేదరికంలో పుట్టిన పలమనేరు పోలీస్ స్టేషన్ స్ఐ కె స్వర్ణ తేజ తల్లిదండ్రుల కష్టాలు చూసి పట్టుదలతో ఉన్నత చదువులు చదివి నేడు ఉన్నత స్థితికి చేరారు. చిత్తూరు జిల్లా పలమనేరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పని చేస్తున్న కే స్వర్ణ తేజ పుట్టపర్తి జిల్లా ధర్మవరం మండలం చీకిచర్ల పంచాయతీ చింతలపల్లి గ్రామంలో 1993, మార్చి 13వ తేదీ వెంగముని, అనసూయమ్మలకు జన్మించారు. స్వతహాగా వారి తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పని చేసుకుని

డిజిపి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ఎస్ఐ (ఫైల్ ఫొటో)

జీవనం సాగించేవారు. చిన్నప్పటి నుంచి కూడా తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గమనించడంతో బాగా చదువుకొని ఖచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని పట్టుదలతో కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించారు. ఈమె విద్యాభ్యాసం మొదటి తరగతి నుండి 5వ తరగతి వరకు చింతలపల్లిలోనూ, ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు చికిచెర్ల పంచాయతీలో గ్రామంలోనూ ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ వరకు ధర్మవరం పట్టణంలోనూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివారు. అటు తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంఏ, బిఈడిని అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో పూర్తి చేశారు. 2015లో గురుమూర్తి వ్యాపారస్తుని వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమార్తెలు వున్నారు. 2017 లో పోలీస్ డిపార్ట్మెంట్ లోని ఎస్ఐ పోటీ పరీక్షల్లో నెగ్గి, 2018 జూలైలో చిత్తూరు జిల్లాలో ఎస్ఐ ఉద్యోగంలో ఆ సంవత్సరం నుండి 2022 సంవత్సరం వరకు చిత్తూరు జిల్లాలోని వెంకటగిరి

కుటుంబ సభ్యులతో ఎస్ఐ స్వర్ణ తేజ

కోట, నింద్ర చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్, పెద్దపంజాణి పోలీస్ స్టేషన్లఓ ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. 2022 లో పెద్దపంజాణిలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు డిజి నుండి అత్యుత్తమ ప్రతిభా పురస్కారంలో భాగంగా ఉత్తమ మహిళా ఎస్సైగా అవార్డును డీజీ నుండి అందుకున్నారు. 2023లో అనంతపూరు దిశ మహిళ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించి 2024 లో పలమనేరు ఎస్ఐగా బదిలీపై వచ్చారు. పలమనేరు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు , నేర నియంత్రణలో అత్యుత్తమైన ప్రతిభను కనబరిచి ప్రజల్లోనూ, అధికారుల్లోనూ, ప్రజా ప్రతినిధుల్లోనూ మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారు.

జనసేన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఐరాల: స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి జనసేన సీనియర్ నాయకులు, నటులు పృథ్వీరాజ్ శుక్రవారం విచ్చేశారు. ఈనెల పిఠాపురంలో 12 ఆవిర్భావ సభ సందర్భంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను కాణిపాక వినాయక స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో, జనసేన రాయలసీమ జోన్ ఎలక్షన్ క్యాంపింగ్ కమిటీ సభ్యులు పూల ప్రభాకర్, జనసేన జిల్లా అధికార ప్రతినిధి మట్టపల్లి మునిరాజులు, జనసేన సీనియర్ నాయకులు, రాజ్ కుమార్, యోగరాజ్, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఆలయాధికారులు ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను సవరించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయుల సినియార్టీ జాబితాలను సమరించాలని యుటిఎఫ్ నాయకులు ఆర్‌జెడికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లందరి ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో పేర్లు గల్లంతు కావడం, టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం డేటా కు భిన్నంగా వివరాలుండడం, సీనియారిటీ లో వ్యత్యాసాలు, తదితర కారణాల వల్ల ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టీచర్లను గందర గోళానికి, ఆందోళనకు గురి చేస్తోంది. అభ్యంతరాలు, అప్పీళ్ళు చిత్తూరు జిల్లా విద్యా శాఖ అధికారి వారి కార్యాలయంలో సమర్పించాల్సి రావడం వల్ల పలురకాల ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణ, వార్షికోత్సవాలు తదితర కార్యక్రమాలను దృష్టిలో వుంచుకుని, అప్పీల్స్ సమర్పణ మండల విద్యా వనరుల కేంద్రాలలో అందజేసే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని, కొన్ని విధానపరమైన అంశాలకు సంబంధించి, డి ఈ ఓ కార్యాలయ పరిధిలోనే సవరణలు చేస్తే, వందలాది మంది టీచర్లకు వ్యయప్రయాసలు తగ్గడంతో పాటు, కార్యాలయ సిబ్బంది కి కూడా ఒత్తిడి తగ్గుతుందని, అక్టోబరు 2005 లో పదోన్నతి పొంది, 03-03-2006 న పోస్టులో చేరిన వారి వివరాలను సవరించాలని, డియస్సీ 2008, డియస్సీ 2012 ల ద్వారా నియమితులయిన టీచర్లకు జాయినింగ్ తేదీలు వేర్వేరుగా నమోదై వున్నాయి. డిఎస్సీ వారీగా, ఒకే జాయినింగ్ తేదీ నమోదుకు చర్యలు తీసుకోవాలని

వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కోరారు. చాలా జాబితాల్లో మెరిట్, ర్యాంక్ ప్రాతిపదికన కాకుండా, పుట్టిన తేదీ మేరకు సీనియారిటీ జాబితా రూపొందించివున్నారు. మెరిట్ అభ్యర్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని, మేనేజ్మెంట్ వివరాలు తప్పుగా నమోదై, ప్రభుత్వ, పంచాయిరాజ్ తదితర యాజమాన్య వివరాలు గందరగోళంగా వున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ వద్ద డిఎస్సీల వారీగా అందుబాటులో వున్న మార్కులు, ర్యాంకులు, రోస్టర్ తదితర వివరాలను, వెబ్సైట్లో అందరికీ అందుబాటులో వుంచాలని అభ్యంతరాలు, అప్పీల్స్ సమర్పణకు సులువుగా వుంటుందని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు ఎన్ మణిగండన్, జిల్లా సహాధ్యక్షు లు కే రెడ్డప్ప నాయుడు, ఎస్ రెహానా బేగం, ఎస్పీ బాషా, పార్థసారథి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్ఐ రామచంద్రారెడ్డికథనం మేరకు వెలుతురు చేను గ్రామానికి చెందిన రమణయ్య కుమారుడు బాలకృష్ణ గౌండర్ (74) గత నెల 26వ తేదీ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో అతడికి తీవ్ర గాయాలు కాగా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడినుండి వేలూరు సీఎం సికి తరలించి తరువాత తిరుపతి ఆసుపత్రికి తరలించారు పరిస్థితి విషమించడంతో గురువారం అతనిని స్వగ్రామానికి తీసుకువచ్చారు. శుక్రవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్, స్కూటర్ ఢీ యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) మండలంలోని చంద్రగిరి- అనుపల్లి రహదారిలో ఇందిరమ్మ కాలనీ వద్ద ట్రాక్టరును శుక్రవారో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో చాణిక్య(24) యువకుడు మృతి చెందాడు. మృతుడు తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ సురేష్ కుమారుడు చాణిక్య. మల్లయ్య పల్లి నుండి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చంద్రగిరి నుండి అనుపల్లి మార్గం వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టి రోడ్డుపై పడ్డాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. దీంతో చాణిక్య అక్కడికక్కడే మృతించాడు. స్థానికులు చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చంద్రగిరి సి ఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చాణిక్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్ వి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి -విజయపురం (నగరి): గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నగరిలో మహిళా సాధికారి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహౌళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకొని సమానత్వం దిశగా ప్రయాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధికారికత విభాగం అధిపతి డాక్టరు ఎ ఇందిరాప్రియ మాట్లాడుతూ మహిళలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరి డిఎస్‌పి మహ్మద అంతా అమేజ్, మగేశ్వర్ పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బనుమతులు అందించారు. ఈ సందర్భంగా డిఎస్పి అంత మహ్మద్ అమేజా విద్యార్థినులకు తన ఫోన్ నెంబర్ అందజేసి అత్యవసర సమయంలో సంప్రదించాలని కోరారు . ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యుర్జునులు పాల్గొన్నారు.

ఐరాల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా ఏపీ జీఇపి మహిళా విభాగం అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా

ఐరాల: లో

నిర్వహించారు. ఐరాల మండలం, జడ్పీ హైస్కూల్ కాణిపాకం (అగరంపల్లి)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైస్కూలులో మహిళలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. గెలిపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐరాల ఏం పిడిఓధనలక్ష్మి , పిఓపిఆర్డి కుసుమకుమారి పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం శెట్టి గుంట పాఠశాలను గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థిని, విద్యార్థులతో ముచ్చటించి వారి ప్రతిభను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో పది మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకరు గైర్హాజరు అయ్యారు. విద్యార్థుల ప్రతిభను చూసి మురిసిపోయిన యుగంధర్ , పాఠశాలకు హాజరైన మొత్తం తొమ్మిది మంది విద్యార్థులకు ప్రతి ఒక్కరికి 500 రూపాయలు(మొత్తం రూ.4,500) బహుమతిగా అందించారు. గిరిజన ప్రాంత పిల్లలు మంచి పరిశుభ్రతను పాటిస్తూ.. తెలుగు, ఇంగ్లీషు, గణితంలో మంచి ప్రావీణ్యత కలిగి ఉన్నారని, ఉన్నత చదువులు కూడా చదువుకొని అందరూ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయుని పనితీరుని ప్రశంసించారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో వెదురుకుప్పం మండలం, దేవళంపేట పంచాయతీ, తెట్టుగుంటపల్లి గ్రామంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుత్తూరు ఉప సంచాలకులు డాక్టరు గోవిందయ్య , పశుగణాభివృద్ధి సంస్థ తిరుపతి ఉప సంచాలకులు డాక్టరు బాలసుబ్రహ్మణ్యం హాజర య్యారు. రైతులు పెయ్య దూడల యాజమాన్యం గురించి వివరించారు. రైతులకు మినరల్‌మిక్స్చర్, గ్రోత్ టానిక్, నట్టల నివారణ,బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డా రాజేష్ , పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా శిక్షణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరులో పిహెచ్ కాలనీ, ఇరువారం లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ శిక్షణా ప్రాంగణం ఎందరో నిరుద్యోగులైన యువతీ యువకులకు అనేక వృత్తులలో నాణ్యమైన ఉచిత శిక్షణ అందించి ప్రముఖ కంపెనీలలో ఉపాది అవకాశాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థగా పేరుంది. ఇప్పటి వరకు నిర్మాణరంగం లో శిక్షణ అందించిన ఎన్ఎసి ఇప్పుడు 2023 నుండి టైలరింగ్ శిక్షణ ప్రారంభించింది. ఈ శిక్షణా సందర్శించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేయడానికి అంగీకరించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో చిత్తూరు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 150 కుట్టుమిషన్లు అందించారు. ఈ శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత శిక్ష, ఉచితంగా కుట్టుమిషన్ పొందడంతో పాటు ఎన్‌సి వెట్ సర్టిఫికెట్టు అందుకోవడం వల్ల భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వంతంగా టైలరింగ్ షాపు ప్రారంభించి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఈ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్త బ్యాచ్ ప్రారంభం అవుతోందని, ఆసక్తి గల నిరుద్యోగ మహిళలు, గృహిణులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని తమ స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలనుకొనే వారు దరఖాస్తు చేసుకోవాలని చిత్తూరు జిల్లా ఎన్ఎసి అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు చిత్తూరు ఎన్ఎసి శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జ్ పి విజయ కుమార్‌ని నేరుగా, సెల్ నంబర్లు 9381366126, 9989245224 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

బెదిరింపులు మానుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోనే అంగన్వాడీల ప్రధాన సమస్యలు పరిష్కారం కోసం మార్చి 10న జరిగే ధర్నా కార్యక్రమం సందర్భంగా చిత్తూరు జిల్లాలో అధికారులు అంగన్వాడీలను బెదిరింపులకు పాల్పడుతున్నారని వాటిని మానుకోవాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లలిత, షకీల లు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ ప్రకటన లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులకు ఫిబ్రవరి 24 నుండి అనేక దఫాలుగా మార్చి 10 విజయవాడలో మహా ధర్నా ఉందని రాతపూర్వకంగా చెప్పినప్పటికీ రకరకాల పద్ధతుల్లో బెదిరింపులు పాల్పడడం చట్ట విరుద్ధం రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ధర్నా చేస్తామని ప్రకటించినప్పటికీ బెదిరింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. ఎప్పుడు లేని విధంగా పదో తారీఖున సెక్టార్ మీటింగులు, ప్రాజెక్టు మీటింగులు పెట్టి అంగన్వాడీలను నిర్బంధించే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. ఎంత నిర్బంధించిన పోరాటం ఆగదని గతంలో 42 రోజులు సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఎన్నో విధాలుగా నిర్బంధాలకు గురి చేసిందని వాటినే ఎదుర్కొన్న అంగన్వాడీలకు ఇదో ఓ లెక్క కాదని తెలిపారు. ఒక్కొక్క ప్రాజెక్టులో ఒక్కొక్క అధికారి ఒక్కొక్క రకమైన పద్ధతులో భయపెట్టాలని చూడడం దేనికి సంకేతమన్నారు. ఇప్పటికైనా అధికారులు అంగన్వాడీలపై బెదిరింపులు మానుకోవా లని డిమాండ్ చేశారు.

నేటి యువతికి ఆదర్శం డిఎఫ్ఓ ఎస్ భరణి

డిఎఫ్ఓ ఎస్ భరణి

ఎల్బ్రస్ శిఖరంపై త్రివర్ణ జెండాతో డిఎఫ్ఓ ఎస్ భరణి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'ఎక్కడమ్మా నీవులేనిదీ.. ఏమిటీ నువ్వు చేయలేనిది?' అన్నట్లుగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు మహిళను దశాబ్దాలుగా వంటింటికే పరిమితం చేశాయి. మహిళలకు హక్కులున్నా పురుషాధిక్య సమాజంలో కాగితాలకే పరిమితయ్యాయి. పురుషుల కంటే తామేమీ తక్కు కాదంటూ నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్న మహిళలలెందరో.. రాజకీయ, వ్యాపార రంగాల్లో తమదైన ప్రతిభ చాటుతున్నారు. ఈ కోవలోకే వస్తారు చిత్తూరు అటవీశాఖాధికారిణి ఎస్ భరణి.. తమిళనాడు , కోయంబత్తూరుకు చెందిన 2020 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్ భరణి మొదట వైమానిక దళంలో పైలట్ కావాలనే కలతో ముందుకు సాగారు. కానీ దురదృష్టవశాత్తు, చూపు సంబంధిత పరిమితుల వల్ల ఆమె ఆ కలను నిజం చేసుకోలేకపోయారు. అయితే, ఈ ఎదురుదెబ్బ ఆమెను వెనక్కి తగ్గించలేదు. భారతీయ అటవీ సేవల్లో చేరాలనే లక్ష్యంతో ఆమె ప్రయత్నాలు ప్రారంభించారు. కొన్ని ప్రాథమిక ప్రయత్నాలు విఫలమైనా పట్టు వీడలేదు.. కుమారుడి పుట్టిన తర్వాత కొద్ది నెలల్లోనే యుపిఎస్‌సి ఐఎఫ్ఎస్ పరీక్షను విజయవంతంగా ముగించారు.

లక్ష్యసాధనలో సాహసాలు

లక్ష్యసాధన కోసం ముందుకు సాగే నైజం తను అనుకున్న లక్ష్యం వైపు నడిపింది. అటవీశాఖాధికారిణి భరణి ఆఫ్రికాలో అత్యంత ఎత్తైన శిఖరం, మౌంట్ కిలిమంజారోను అధిరోహించింది. కేవలం పరిపాలనా రంగంలోనే కాకుండా సాహసయాత్రల పట్ల కూడా గొప్ప ఆసక్తి కలిగి ఉన్నారు. ఆమె క్రీడలలో మక్కువ కలిగిన వ్యక్తిగా, శిఖరాల ఆరోహణ ప్రయాణాన్ని ప్రారంభించారు. లడఖ్‌లో 6,200 మీటర్ల ఎత్తుగల కాంగ్ యాట్సే పర్వతాన్ని అధిరోహించడానికి చేసిన తొలి ప్రయత్నం, తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. రెండు రోజులపాటు నాకు బాగా ఆకలి వేయలేదు.. శరీరం బలహీనపడిపోయింది. అందువల్ల దిగివచ్చే కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది..” అని ఆమె చెప్పారు. అయితే, ఇది ఎలాగైనా సాధించాలనే సంకల్పం పెంచిందని తెలిపారు. తదుపరి లక్ష్యాన్ని మౌంట్ కిలిమంజారోగా నిర్ణయించుకున్నారు. మౌంట్ కిలిమంజారోను అధిరోహించి మహిళలు ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారు. పట్టుదలతో సాధించాలనే తపన లక్షసాధనకోసం ఏకాగ్రతతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చుంటున్నారు. తొలి ప్రయత్నం విఫలమైనా పట్టువదలక 2024, మార్చి 7న, భరణి మౌంట్ కిలిమంజారో శిఖరమైన ఉహురు పీక్ వద్దకు చేరుకుని విజయం సాధించారు. మార్చి 8న ఆమె మౌంట్ కిలిమంజారో బేస్ క్యాంప్‌కు తిరిగి వచ్చినప్పుడు, అదే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో, ఈ ఘనత మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అనుకున్న లక్ష్యం సాధించిన భావోద్వేగపూరిత క్షణం. నా జీవితాన్ని తీర్చిదిద్దిన గొప్ప మహిళలందరికీ ఈ ఘనతను అంకితం చేస్తున్నాను” అని ఆమె అన్నారు.

పర్వాతారోహణలో ఎదురైన సవాళ్లు

బహుళ అవరోధాలను ఎదుర్కొంటూ, భరణి ఈ విజయం సాధించారు. రాత్రివేళ తీవ్రమైన గాలులు వీచే క్రమంలో, తల తిప్పినా ఇబ్బంది కలిగేలా ఉండేది. ఆమె చెప్పిన ప్రకారం, చివరి 24 గంటల అధిరోహణ అత్యంత క్లిష్టమైంది. మొదట ఆమె రాత్రిపూట వ్యాయామం చేస్తూ, రాత్రి జాగారం అలవాటు చేసుకున్నారు. ఎత్తైన ప్రదేశాల్లో తక్కువ ఆక్సిజన్, భోజనంపై ఆసక్తి తగ్గడం, నిద్రలేమి వంటి సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత ఎత్తైన స్వతంత్ర పర్వతమైన కిలిమంజారో, కెన్యా-టాంజాయా సరిహద్దులో వుంది. ఇది తన ప్రత్యేకమైన వాతావరణ మార్పులు, అడవి ప్రాణులను కలిగి ఉండటం ద్వారా ప్రసిద్ధి చెందింది. ఈ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా, వివిధ వాతావరణ పరిస్థితులను అనుభవించవచ్చు. ..' అని భరణి తెలిపారు.

సమాజంలో మహిళలు నిరంతరం అవరోధాలను అధిగమించి, కొత్త శిఖరాలను చేరుకుంటున్నారు. ఈ పరంపరలో, ఐఎఫ్ఎస్ అధికారిణి భరణి ఎస్ ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచారు. ప్రొఫెషనల్, భౌతిక పరంగా ఎన్నో సవాళ్లను అధిగమించిన ఆమె విజయాలు, మహిళల సాధికారతను మరోసారి రుజువు చేశాయి.

ఎల్బ్రస్ శిఖరంపై త్రివర్ణ పతాకం

ఆమె ఇటీవల యూరప్‌లో అత్యంత ఎత్తైన శిఖరం మౌంట్ ఎల్బ్రస్ (ఎత్తు 5,642 మీటర్లు)ను 2024 ఆగస్టు 15న, భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధిరోహించడం వ్యక్తిగతంగా గొప్ప విజయం. జట్టు నాయకత్వం లెఫ్టినెంట్ కర్నల్ రోమిల్ బరథ్వాల్, పర్వతారోహకుడు భారత ఆధ్వర్యంలో, మొత్తం 10 మంది సభ్యులు తుది అధిరోహణను ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 11.30 గంటలకు మౌంట్ ఎల్బ్రస్ శిఖరానికి చేరుకున్నారు. అప్పుడు గాలుల వేగం ఇంకా ఎక్కువగా ఉండడంతో, త్రివర్ణ పతాకాన్ని గట్టిగా పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ శిఖరాన్ని అధిరోహించి భారత జెండాను రెపరెపలాడించడం భరణికి, ఆమె జట్టుకు, భారతదేశానికి గర్వకారణంగా మారింది.“అది నా జీవితంలో అత్యంత గర్వకారణమైన క్షణం” అని ఆమె ఆనందంతో గుర్తుచేసుకున్నారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల స్ఫూర్తితో

సమాన హక్కుల సాధనకు కదలాలి..

ప్రజాశక్తి - గంగవరం : అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల స్ఫూర్తితో సమాన హక్కుల సాధనకు కదలాలని జిల్లా ఐద్వా కన్వీనర్ భువనేశ్వరి పిలుపునిచ్చారు.

పెట్టుబడి దారీ వ్యవస్థ తొలి దశలో విపరీతమైన శ్రమ దోపిడీ కొనసాగిందని, రోజుకు 14 నుండి 16 గంటలు సుదీర్ఘ పనిగంటలు హీనమైన వేతనాలు గాలి, వెలుతురు లేని పరిశ్రమల్లో గొడ్డు చాకిరీని చేయించేవాళ్లని ఈ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 18,19 శతాబ్దాలలో శ్రామిక మహిళలు సమ్మె చేశారు. అమెరికా, జర్మనీ, ప్యారిస్ తదితర దేశాల్లో మహిళల ఓటు హక్కు , పని గంటలు తగ్గించాలని పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు వేతనాల పెంపు ఒకరోజు సెలవుల కోసం సమ్మెలు చేపట్టారని, ఫలితంగా 1845లో అమెరికా న్యూయార్క్ నగరంలో మహిళలు చేపట్టిన పోరాటాల ఫలితంగా చట్టబద్ధ అనేక సౌకర్యాలు సాధించుకున్నారన్నారు. అయినా 30 ఏళ్లు గడిచినా ఈ లక్ష్యాలు ఆశించిన సమానత్వం ఇవ్వలేదన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం చేయగలమా? మహిళలు ఆత్మగౌరవంతో జీవించే సమాజాన్ని నిర్మించగలమా? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరిలో తలెత్తుతున్నాయన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ స్ఫూర్తి సమానత్వ విలువలు మరుగున పడుతున్నాయి భేటీ బచావో బేటి పడావో బట్టి నినాదాలు కేవలం కాగితాలపై మాత్రమే మిగిలిపోయాయి. మహిళలపై దాడులు అత్యాచారాలు పెరుగుతున్నా నిందితులను బహిరంగంగా సమర్థిస్తున్నారన్నారు. సనాతన ధర్మం పేరుతో మహిళలను రెండవ స్థాయి పౌరులుగా భావిస్తూ పురుషాధిపత్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. మోడీతో స్నేహం చేసిన చంద్రబాబు సైతం ఈ పితృస్వామ్యాన్ని బలపరుస్తున్నారు. కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో యువత తమ జీవిత భాగస్వామిని స్వేచ్ఛగా ఎంపిక చేసుకొని హక్కును హరించారు కులం లేదా ఆస్తి కారణంగా ప్రేమ వివాహాల విషయంలో మోసం చేసిన నేరం పరిగణించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ.1500 వంటి హామీలు ఇచ్చిన వాటి అమలు గురించి స్పష్టత లేదు. 33 శాతం రిజర్వేషన్ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారు . కుటుంబాధిపత్యం కొనసాగుతోంది.. కనీసం సాధించిన హక్కులను కాపాడుకోవడానికి మహిళలు ఐక్యంగా ముందుకు రావాలి.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల లాభాల కోసం హక్కులను తక్కువ చేయడానికి ప్రశ్నించాలి. అణచివేతను అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల స్ఫూర్తితో సమాన హక్కుల సాధన కోసం కదలాలని పిలుపు నిచ్చారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి

మహిళలను చైతన్య పరుస్తున్న ఐద్వా జిల్లా మహిళా కార్యదర్శి భువనేశ్వరి

సేవ, రాజకీయాల్లో వన్నె తెచ్చిన లగడపాటి కృష్ణ కుమారి

ప్రజాశక్తి-పలమనేరు: ఇటీవల సోషియల్ మీడియా మాధ్యమాలు పరంగా , ప్రజలలో అనేకరకాలుగా... స్త్రీ శక్తిని విస్తరింపజేస్తూ సేవ, రాజకీయ పరంగా చిత్తూరు జిల్లా సామాన్యులలో లగడపాటి కృష్ణకుమారి పార్థసారథి పూతలపట్టు నియోజకవర్గ, టీడీపీ మహిళా వైస్ ప్రసిడెంట్ పార్థసారథి వన్నె తెచ్చారు. పేటమిట్ట, ఐరాల మండలానికి చెందిన లగడపాటి కృష్ణ కుమారి 1972, ఆగస్టు, 23న పుట్టారు. తండ్రీ రాచనేని రామానాయుడు, తల్లి బంగారమ్మ. ఆమె చిన్నతనంలోనే తండ్రి మరణించగా సోదరుడు రాచనేని శేషాద్రి నాయుడు సంరక్షణలో చాలా అల్లారు ముద్దుగా పెరిగింది. అరగొండ, కాలేజ్ చిత్తూరు కృష్ణవేణి ఉమెన్స్ కాలేజీ లో చదువు కున్నారు. వీరికి 1995, జులై 10వ తేదీ నలగాంపల్లిలో వివాహమైంది. భర్త లగడపాటి పార్థసారథి నాయుడు, కుమార్తె లగడపాటి కిరణ్ ప్రీతి మిస్ ఇండియా ఇన్ డెలావేర్ స్టేట్ యుఎస్‌లో-2023గా నిలిచారు. కుమారుడు లగడపాటి బద్రీనాథ్ సెయింట్ లూయిస్ యుస్ఎ యంయస్ చేస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై విరక్తి చెంది టీడీపీలో కీలక పాత్ర వహించారు. దాదాపు అన్ని నియోజక వర్గాలు , (తంబళ్లపల్లె తప్ప) తిరిగారు. సొంత నియోజకవర్గం పూతలపట్టు నియోజకవర్గం లో నిత్యం, మీటింగ్స్, పేపర్ స్టేట్మెంట్స్, వీడియోస్ ద్వారా తనదైన శైలిలో వైసిపి, ప్రభుత్వంపై పోరాటం చేశారు. చంద్రబాబు రాజమండ్రీ సెంట్రల్ జైల్ లో ఉన్నప్పుడు 53 రోజులూ ఉపవాసం వుండి పోరాడారు. స్కూలు పిల్లలకు విద్యా సామగ్రి అందించారు. పిల్లలకు మోటివేషన్ స్పీచ్ ఇవ్వడం, కళాకారులకు చీరలు, కొలాట గజ్జలు అందించారు. భజన కార్యక్రమాలు చేయించడం, అన్నదానం లాంటివి చేస్తుంటారు. ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న వివాహ వ్యవస్థ, సంబంధ బాంధవ్యాలు, తల్లి పిల్లల తల్లిపాల పోషణతో సంరక్షణ, తదితర విషయాల గురించి ఇటీవల పలమనేరులో నిర్వహించిన కమ్మ అభ్యుదయ సంఘం సమావేశంలో నొక్కి చెప్పారు. తల్లిదండ్రులను అత్తమామలను సమానంగా గౌరవించాలని సూచించారు. స్త్రీ మూర్తిగా అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్న మూర్తి మణిని గౌరవించడం, వారిని ప్రోత్సహించడం, సొసైటీ బాధ్యత నిర్వహించడం లగడపాటి కృష్ణకుమారి తమ ధ్యేయంగా పెట్టుకున్నారు. అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కూమార్తె లగడపాటి ప్రీతి..

మాట్లాడుతున్న టిడిపి మహిళా నాయకురాలు కృష్ణకుమారి

సమాజ మానసిక స్థితి మెరుగుపడాలి

మహిళా మేధావుల 'మనస్సులో మాట'

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

నేడున్న పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అయితే రంగం ఏదైనా కాలానుగుణంగా మారుతున్న కొంతమంది మనుషుల్లో హింసాత్మక, పాశవిక ధోరణిని మహిళలపై ప్రదర్శిస్తున్నారు. ఆస్తి పంచి ఇవ్వలేదని తాతపైనా, అమ్మపైనా కూడా దాడులకు పాల్పడుతున్నారంటే సమాజ పోకడ ఒక్కోసారి భయభ్రాంతులకు గురయ్యే ప్రమాదం లేకపోలేదు. చిన్నపిల్లలను సైతం చిదిమేస్తున్నారంటే మానసిక పరిపక్వత ఎంత రాక్షసంగా తయారవుతున్నారో కూడా అంచనా వేయాల్సి ఉంది. మహిళలు సైతం మానసికంగా కుంగిపోతూ బలవన్మరణాలకూ పాల్పడుతున్నారు. సమాజ మానసిక స్థితి మెరుగుపడినపుడే ఇలాంటి దుశ్చర్యలకు ఫుల్‌స్టాప్ పెట్టవచ్చు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాల్లో మహిళలతో 'ప్రజాశక్తి' ప్రత్యేక ముఖాముఖి నిర్వహించింది. మహిళా సమాజం హితం కోసం వారు ఇచ్చిన సలహాలు, సూచనలు వారి మాటల్లోనే...

కుటుంబాల్లో లింగ సమానత ఉండాలి

డాక్టర్ పద్మా కమలాకర్, హిప్నో థెరపిస్ట్

మహిళా దినోత్సవం సందర్భంగా సమానత్వం గురించి పెద్దఎత్తున చర్చ జరుగుతుంది. చాలా కుటుంబాల్లో తమ కుమార్తెలను కుమారులతో సమానంగా చూస్తున్నామని చెబుతుంటారు. అయినా సమాజంలో లైంగిక వేధింపులు, అత్యాచారాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. 'ఫోర్నోగ్రఫీ' వల్ల మహిళను వ్యక్తిగా కాకుండా, శారీరక వాంఛ తీర్చే ఓ వస్తువుగా మాత్రమే చూసే స్వభావం పెరుగుతుంది. మహిళల భావోద్వేగాలను అర్థం చేసుకోలేకపోతున్నారు. మాదకద్రవ్యాలతో విచక్షణ కోల్పోయి హింసకు పాల్పడుతున్నారు.

చదువుతూనే ఆత్మస్థైర్యాన్ని పొందాలి : డాక్టర్ స్రవంతి, మెడికల్ ఆఫీసర్, మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నేడు సమాజంలో మహిళలను చిన్న చూపు చూసే ధోరణులు నిత్య కృత్యమయ్యాయి. చిన్న విషయాలకు కూడా ఎంతో విలువైన ప్రాణాన్ని బలి పెడుతున్నారు. ప్రతి ఆడపిల్లకి ఉన్నతమైన విద్య ద్వారా ఆత్మ స్థైర్యాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ఆత్మస్థైర్యాన్ని కోల్పోయే పరిస్థితి నుండి మహిళలు బయటపడాలి. ఎక్కడో జరిగిన హింసాత్మక, పాశవిక హత్యలను మీడియాలో పదేపదే చూపించడం వలన సైకో ఆలోచనలు కలిగిన వారికి అది ప్రేరేపనగా కనపడటం, వారిపై ప్రభావవంతం చూపడం జరుగుతోంది. వీటిని నియంత్రించగలిగితే అత్యంత ఘోరమైన హత్యలు అడ్డుకోవడానికి ఆస్కారం ఉంది.

పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలి : ప్రియ,కరస్పాండెంట్, బిసిఎం హై స్కూల్, మంగళం.

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉండాలి. చిన్ననాటి నుండే వారిలో గుర్తించిన మార్పులకు తదనగుణంగా మంచి బుద్ధి మాటలను నేర్పుతూ మంచి పౌరులుగా ఎదిగే దానికి కృషి చేయాలి. ఒక విద్యాసంస్థకు కరస్పాండెంట్ గా పాఠశాలకు వచ్చే పిల్లల్లో ఎప్పటికప్పుడు మార్పులను గమనించి వారి తల్లిదండ్రులకు వారిలో గుర్తించిన మార్పులను తెలియజేస్తాము. తద్వారా తల్లిదండ్రులు వారి పిల్లల్లో వచ్చిన మార్పులకు తగిన రీతిలో స్పందించడం మేము చూశాము. మంచి పౌరుడిగా సమాజంలోకి ప్రవేశించడానికి పాఠశాల స్థాయి నుండి తగిన జాగ్రత్తలను, చర్యలను మేము పాటిస్తున్నాం. ముఖ్యంగా మహిళల్లో ధైర్యం చాలా అవసరం. సమానత్వపు ఆలోచనలు కలిగిన కుటుంబం సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తమ పిల్లలకు తెలియజేస్తారు. కానీ విద్య లేని కుటుంబాలు సమాజంలో జరిగే అంశాలపై అవగాహన లేమి కారణంగా కొన్ని అసాంఘిక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వాల చైతన్యంతో పాటుగా ప్రజలు కూడా సమబావ ఆలోచన, అంతరాలు వీడి విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్నాం. మహిళల అభ్యున్నతికి మరింత అవగాహన సమాజంలో రావాల్సి ఉంది.

మహిళ చదువుకుంటే ఓ తరం మార్పు : రాధారాణి, ఎంసీ మెంబర్, కాస్ట్ అకౌంట్ ఆఫ్ ఇండియా, తిరుపతి చాప్టర్

ఒక కుటుంబంలో చదువుకున్న మహిళ ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యకర వాతావరణంలో ఉండటమే కాకుండా, ఒక తరం మార్పు చెందడానికి అవకాశం ఏర్పడుతుంది. వృత్తిలో పని ఒత్తిడి వలన నేడు క్రూరమైన ఆలోచనలు వచ్చి పాశవిక హత్యలకు దారితీస్తున్నాయి. వీటిని ప్రసార మాధ్యమాలు విశదీకరించి చూపిస్తుండడంతో ఇలాంటి ఘటనలే పునరావత్తమవుతున్నాయి అన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తెరగాలి. వీటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి కుటుంబంలో గతంలో ఉన్న సఖ్యత నేడు కనుమరుగైంది.

సమానత్వపు ఆలోచనలు మరింతగా పెరగాలి : అన్నా అనితయాదవ్, కార్పొరేటర్, తిరుపతి

నేడు సమాజంలో, కుటుంబాలలో అమ్మాయిల పట్ల సమానత్వపు ఆలోచనలు మరింతగా పెరగాల్సి ఉంది. అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళలు ఎక్కడో ఒకచోట అణిచివేతకు గురి అవుతూనే ఉన్నారు. మహిళలకు సుస్థిర స్థానాలు రాజకీయ పార్టీలు కల్పిస్తున్నాయి. ప్రజలకు సేవ, సమాజంలో మార్పు తీసుకురావడానికి మహిళలు చేయగలుగుతారు. అందరినీ కలుపుకొని ప్రజల సమస్యలను పరిష్కరించగల నైపుణ్యం మహిళలకు ఉంది. ఆకాశమే హద్దుగా ఆరోగ్యకరమైన ఆలోచనలతో సమాజం ఉంటేనే సాధ్యమవుతుంది.

కార్పొరేషన్, తుడాకు వన్నెతెస్తూ..

సవాళ్లకు సమాధానం 'నాగమౌర్య'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌గా, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌ఛైర్మన్‌గా రెండు బాధ్యతల్లోనూ రాణించాలంటే ఓ రకంగా ముళ్లకిరీటమే అని చెప్పాలి. అయితే కార్పొరేషన్ కమిషనర్‌గా, తుడా వైస్‌ఛైర్మన్‌గా రెండు బాధ్యతల్లోనూ సవాళ్లకు సమాధానమిస్తూ ఆ పదవులకే వన్నె తెస్తున్నారు నాగమౌర్య. కడప జిల్లా నాగులపల్లి గ్రామస్తురాలు. గత ఏడాది జూలైలో బాధ్యతలు చేపట్టారు. తిరుపతి అంటేనే రాజకీయ నేతల ఒత్తిడి అధికంగా ఉంటుంది. ప్రోటోకాల్ బాధ్యతలు ఎక్కువే. అటువంటి ప్రదేశంలో శ్రీవారి చెంత రాణిస్తున్నారు. ఉద్యోగులకు చాలా మందికి ఉదయం 9 గంటలపైన ఉద్యోగ బాధ్యతలు మొదలవుతాయి. అయితే నాగమౌర్యకు తెల్లవారుజామున ఉదయం 5 గంటలకే, సూరీడు రాకముందే వార్డుల్లోకి వచ్చి పారిశుధ్య పనుల తనిఖీలను ప్రారంభించడం ఆమె దినచర్యలో భాగంగా మారిపోయింది.

తిరుపతి యాత్రాస్థలం కావడంతో భక్తుల తాకిడితో పాటు విఐపిల తాకిడి అధికంగానే ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ ఖాజానా దాదాపు ఖాళీ అయిపోయింది. ఈ ఖజానాను నింపాలంటే భగీరథ ప్రయత్నం చేయాల్సిందే. కమిషనర్ మౌర్య బాధ్యతలు తీసుకున్న తరువాత ఖజానా నింపేందుకు పన్నులు వసూలు చేస్తూనే, అభివృద్ధి పనులను, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. 30 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ సమస్య తీవ్రమై తిరుపతి గబ్బు కొడుతుండడంతో పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక ప్రకారం సరఫరా చేస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాటు, డయల్ యువర్ కమిషన్‌ను సిపిఎం సూచన మేరకు పునరుద్ధరించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లకు వంద కోట్ల బకాయి పడగా, కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో 30 కోట్ల రూపాయల బిల్లులు జమ అయ్యేలా చేశారు. ఇటీవల వైకుంఠ ఏకాదశి సందర్భంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు చనిపోగా, మృతదేహాలను వారి గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు, బాధితులను ఓదార్చి ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించారు. పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అనేక అవార్డులు వచ్చాయి. ఈసారి 2025 స్వచ్ఛ సర్వేక్షన్‌లోనూ టాప్ టెన్‌లో తిరుపతి ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. స్కావెంజర్ కాలనీలో పారిశుధ్య కార్మికుల ఇళ్లకు పెయింటింగ్‌లు వేయించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో 'శభాష్ మౌర్య' అనిపించుకున్నారు. తుడా వైస్‌ఛైర్మన్‌గానూ ఖాళీ అయిన ఖజానా నింపేందుకు మహిళా దినోత్సవం రోజు నుండే తుడా టవర్స్ వేలం నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న శెట్టిపల్లి సమస్య పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నారు.

పేదలకు 'ఉయ్ సపోర్ట్'

సనాతనాన్ని ప్రశ్నిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్టు అధ్యక్షులు తహసున్నీసా బేగం

'పేదలకు సేవ చేయడం మహాభాగ్యం.. మహిళలతో పాటు మురికివాడ ప్రాంతంలో నివసించే ప్రజలు, పేద విద్యార్థులు, రైతులు, మహిళలకు మా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాం' అని ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు తహసున్నీసా బేగం అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మహిళలకు సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించినపుడే ఇది సాధ్యమవుతుందన్నారు. పురుషులతో సమానంగా హక్కులను కల్పించినపుడే మహిళలకు సహజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లవుతుందన్నారు. ఆమె మాటల్లోనే...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

మహిళలు వంటింటికే పరిమితం కావాలని, అందునా ముస్లీం మహిళలు బురఖా మాటునే ఉండాలని హిందూ, ముస్లీం సనాతన ధర్మం నొక్కి చెబుతోంది. అయితే నా కుటుంబం అందిస్తున్న సపోర్ట్‌తో మురికివాడల్లో పిల్లలకు తల్లిలా, సోదరిలా సేవలందిస్తున్నాను. మహిళలకు సమాన హక్కులు రావాలంటే విద్య ఒక్కటే మార్గం. అందుకే మురికివాడల్లో బాలికలకు పాఠ్యపుస్తకాలు అందిస్తూ, ఉచితంగా చదువు చెప్పిస్తున్నాం. చదువు పట్ల ఆసక్తిని పెంచి వారి వయస్సును బట్టి స్కూళ్లల్లో చేర్పిస్తున్నాం. ప్రతి ఆదివారం మురికివాడల్లో పిల్లలకు చదువు నేర్పిస్తున్నాను. నేను బిఎస్సీ నర్సింగ్ చేశాను. తెలంగాణా రాష్ట్రం గద్వాల్ జిల్లా మాది. మానపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత కమిషన్ ఆన్ గ్రాడ్యుయేట్స్ ఆఫ్ ఫారిన్ నర్సింగ్ స్కూల్స్ (సీజీఎఫ్ఎన్ఎస్) కోర్సు చేశాను. అమెరికా వెళ్లాలనుకున్నాను. కుదరక పోవడంతో ఎమ్ఎస్సీ నర్సింగ్ సైకియాట్రీ కోర్సులో చేరాను. అయితే కుటుంబ అవసరాలకు ఇంటికే పరిమితం అవ్వాల్సి వచ్చింది. మా అబ్బాయికి ఎస్వీ మెడికల్ కాలేజీలో సీటు రావడంతో తిరుపతికి వచ్చి స్థిరపడ్డాను. చదువుపై ఉన్న ఆసక్తిని సేవా కార్యక్రమాల వైపు మళ్లించాను. సావిత్రీబాయ్‌పూలే అవార్డును అందుకున్నాను. జీతంలో కొంత భాగం పేదవారికి ఇవ్వడం అనేది అమ్మానాన్న, అమ్మమ్మ నుంచి నేర్చుకున్నాను. పిల్లలు ఉద్యోగరీత్యా సెటిలయ్యారు. ఒక్కపూట కూడా అన్నానికి నోచుకోని కాలనీలను చూసి చలించి వాళ్లకకు రోజూ అన్నం పెట్టడం, పిల్లల బాగోగులు అడిగి తెలుసుకోవడం

అలవాటయ్యింది. బ్రష్, పేస్ట్ సబ్బు కూడా తెలియని బాల్యం వాళ్లది. స్కూల్లో పేరుంటుంది కానీ, స్కూలుకు వెళ్లరు. వారికి 'వియ్ సపోర్ట్'. మొదట అన్నారావు సర్కిల్ ఎస్టీ కాలనీతో మొదలు పెట్టాను. రోజూ కాలనీకి వెళ్లడం, బ్రష్ చేయమని, స్నానం చేసి రమ్మని చెప్పడం నేర్పించాను. పాఠాలను కంఠతా పట్టించి, చదవడం, రాయడం నేర్పిస్తున్నాను. చదవగలిగిన క్లాసులో చేర్పిస్తున్నాను. ఈ యజ్ఞంలో నన్ను చూసి నా స్నేహితులు ముందుకు వచ్చి పాఠాలను చెబుతున్నారు. విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తూ వారిలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా సృజనాత్మకతను వెలికితీస్తున్నాం. విద్యార్థులకు వృత్తినైపుణ్యం తరగతులను తరచూ నిర్వహిస్తున్నాం.

రెవెన్యూ సమస్యలు
పరిష్కరించడమే ఆనందం

పలమనేరు ఆర్‌డిఓ భవాని

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరులో పనిచేస్తున్నటువంటి ఆర్ డి ఓ భవాని గారు 1.6.1977లో కడప జిల్లా పులివెందుల నెహ్రూ నగర్‌లోని టైలర్ గంగయ్య, అంకాలమ్మల ముద్దుల పుత్రిక. ఆమె విద్యాభ్యాసం కడప జిల్లా మైలవరం లోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో మొదటి తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్నారు. ఇంటర్మీడియట్ తిరుపతి లోని శ్రీ పద్మావతి కళాశాలలో ను ఎం ఎస్ సి మైక్రోబయాలజీ అనంతపూర్లోని శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీలో చదువుకున్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఈమె ఎంతో పట్టుదలతో 2001వ సంవత్సరంలో గ్రూప్ 2 పోటీ పరీక్షల్లో నెగ్గి కదిరిలోని అసిస్టెంట్ సెరి కల్చర్ ఆఫీసర్‌గా పనిచేశారు 2005 వ సంవత్సరంలో కడపలో డిప్యూటీ తాసిల్దార్‌గా పనిచేశారు. అదే సంవత్సరం ఎం మోహన్ బాబును వివాహం చేసుకున్నారు. 2010వ సంవత్సరం కడప జిల్లా తాసిల్దార్‌గా పదోన్నతి పొందారు. అనంతరం 2020 సంవత్సరంలో చిత్తూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఉండి 2024 సంవత్సరం ఆగస్టు నెలలో పలమనేరు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా పదోన్నతిపై వచ్చి ఇక్కడ ప్రజల నుంచి మన్ననలు పొందుతున్నారు. 2001వ సంవత్సరంలో తన ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభా పురస్కారం పొందుతున్నారు. 2019 సంవత్సరం స్వచ్ఛభారత్ సేవలో కడపలో ఉత్తమ ప్రతిభా పురస్కారంతోపాటు బంగారు పథకం పొందారు.



ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నేడు కూరేసి లక్ష్మికి సీఎం పురస్కారం

ప్రజాశక్తి -కోట: కోట మండలం, తిమ్మనాయుడుపాలెం గ్రామానికి చెందిన పొదుపు సభ్యురాలు కూరేసి లక్ష్మి ఈనెల 8వ తేదీ(శనివారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరులో జరిగే కార్యక్రమంలో సీఎం చేతులమీదుగా ఐదు లక్షల రూపాయల చెక్కును అందుకోనున్నారని కోట వెలుగు కార్యాలయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనీలా తెలిపారు. ఆమె శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పొదుపు సభ్యురాలు కూరేసి లక్ష్మి అందరికీ ఆదర్శవంతంగా నిలిచారని తెలిపారు. పొదుపు రుణాలను వృధా చేయకుండా ఆర్థిక ఎదుగుదలకు వాడుకోవాలని సూచించారు.

దేవాదాయ శాఖ మంత్రికి వినతి పత్రం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: అసెంబ్లీ సమావేశాలలో భాగంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డిని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందచేశారు. నియోజకవర్గంలోని దేవాలయాలకు ఉన్న కమిటీలను రద్దు చేయాలని, దేవాలయలకు దూప ద్వీప నైవేద్యం కింద రావలసిన నిధులను, చిల్లకూరు మండలం, వేళ్ళపాలెం గ్రామంలోని భీమేశ్వర స్వామి దేవాలయానికి నిధులను మంజూరు చేయాలని కోరారు.

సీతమ్మ భూములపై దుష్ప్రచారాలు తగవు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పంగులూరు సీతమ్మ భూములపై కొంతమంది ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారాలు చేస్తున్నారని వాసవి కన్యకా పరమేశ్వర ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షులు పామిడి సత్యనారాయణ శెట్టి తెలిపారు. స్థానిక కొత్త వీధిలోనికి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంగులూరి సీతమ్మ వీలునామ సాధన దిశగా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఆర్థిక వనరుల సమీకరణకు వీలునామా నియమావాళికి అనుగుణంగానే కొంత స్థలాన్ని లీజుకు ఇచ్చామన్నారు. అంతేకానీ భూమి విక్రయించడం, కోట్లాది రూపాయల స్వాహా చేయడం వంటివి జరగలేదని స్పష్టం చేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ సూచనల మేరకే భూములు లీజు ఒప్పందం జరిగిందని తెలిపారు. ఎవరు ఇన్ని అవంతరాలు సృష్టించినా పంగులూరి సీతమ్మ వీలునామా అమలు సాధనదిశగా ముందుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి హైలెక్స్ బ్లాక్ ఎడిషన్ విడుదల

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టయోటా కిర్లోస్కర్ మోటార్ సంస్థ నూతనంగా తయారుచేసిన హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను శుక్రవారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సేల్స్–సర్వీస్–యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా మాట్లాడుతూ హైలక్స్ బ్లాక్ ఎడిషన్ ధర రూ. 37,90,000/– (ఎక్స్–షోరూమ్) అని తెలిపారు. అత్యాధునిక హంగులతో ఈ వాహనం రూపొందించామని తెలిపారు. దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల విద్యా వికాసంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళా విద్యాభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని డీఎస్పీ శ్రీలత పేర్కొన్నారు. స్థానిక న్యూ బాలాజీ కాలనీలో మెక్ మై బేబీ జీనియస్ స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో "అమ్మాయిల విద్యా – సమాజ అభివృద్ధి" అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా తిరుపతి ఈస్ట్ డిఎస్పి ఎం.శ్రీలత హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి మాధవ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థినులు చదువులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేక్ మై బేబీ జూనియర్ స్కూల్ డైరెక్టర్ అశ్విని, ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్, నగర కార్యదర్శి తేజ, వర్సిటీ అధ్యక్షులు నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సన్ రైస్ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కోట సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని పేర్కొన్నారు. గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ మహిళా మూర్తులను గౌరవించడం మన సంప్రదాయమన్నారు. అనంతరం మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ రెడ్డి, బాలమణి , ఆదిశంకర ప్రిన్సిపాల్ రూపవతి, కళాశాల అధ్యాపకులు కీర్తన, సునీత, శివశంకర్, ప్రణయ్, సూర్య, విద్యార్థులు తదితరులు, పాల్గొన్నారు.

గూడూరు పట్టణ పరిధిలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్.ఆర్ ఐ.టి.ఆర్. ఎఫ్. ఐ .డి హెడ్ మనీషా ఖొమేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ కల్పన, డాక్టర్ ఎస్.వి పద్మావతి, డాక్టర్ కె.విజయనిర్మల, డాక్టర్ జి.సునీత, డాక్టర్ మధురమ్మ, ఇతర మహిళా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు, సన్ రైస్ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలలో సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

లింగ సమానత్వం రావాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సమాజంలో లింగ సమానత్వం సాకారమైనప్పుడే మహిళా సాధికారత సాధ్యపడుతుందని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీకాళహస్తి ఎస్ఎఫ్ఐ శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం, మహిళా సాధికారత కోసం పోరాడిన మహనీయుల సేవలను గుర్తు చేస్తూ డీఎస్పీ కొనియాడారు. మహిళా విద్య, లింగ సమానత్వం, రక్షణ, హక్కులపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, షరీఫ్, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు గురవయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కూడా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, అధ్యాపకులు బాపనయ్య, తులసి, సునీత సుభాషిణి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

ప్రజాశక్తి -ఏర్పేడు: ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఏర్పేడు వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల నుండి 100 మంది మహిళలు మరియు ఎస్ఓఎస్ మదర్స్ పాల్గొన్నారు. ఈ వేడుకకు రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మమ్మ, మానసిక నిపుణులు డా.సుధాకర్, డీసీసీబీ బ్రాంచ్ ఇంచార్జ్ మేనేజర్ దీపారాణి, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా బలోపేతం కావాలని సూచించారు.

మహిళల భాగస్వామ్యంతో సంపద సృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : మహిళల భాగస్వామ్యంతో సమాజంలో సంపదను సృష్టించవచ్చని, జ్ఞాన సంపదకు మించిన సంపద లేదని, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంఓ టీటీడీ బోర్డు సభ్యులు రంగశ్రీ, జానకీ దేవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రేఖ, ప్రముఖ వక్త రాజేశ్వరి, హైదరాబాద్ సిఎస్‌బి ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ బాలాలత, అర్జున్ అవార్డు గ్రహీత జీవనజీ దీప్తిలు విజయం సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని అందరూ స్ఫూర్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఇంద్రాణి, హైదరాబాద్ సిఎస్‌బి ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ బాలాలత, అర్జున్ అవార్డు గ్రహీత జీవనజీ దీప్తిలను అదనపు ఈవో జ్ఞాపిక, శాలువతో సన్మానించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం టీటీడీలోని వివిధ విభాగాల్లో విశేష సేవలు అందిస్తున్న 12 మంది మహిళా ఉద్యోగులకు పద్మావతి అవార్డులు ప్రదానం చేశారు. ఏడాది కాలంలో ఉద్యోగ విరమణ చేయనున్న 63 మంది మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌వో వరప్రసాద్, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో ఆనందరాజు, బోర్డు సెల్ డెప్యూటీ ఈవో ప్రశాంతి, పలువురు మహిళా డెప్యూటీ ఈఓలు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు ఫైనార్ట్స్‌లో రెండవ స్థానం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్, ఆచార్య మురళీధర్ నాయకత్వంలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ బృందానికి ఫైన్ ఆర్ట్స్‌లలో ఓవరాల్ చాంప్ రెండవ స్థానం లభించింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో గల అమిటి యూనివర్సిటీలో జరిగిన జాతీయ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలలో ఫైన్ ఆర్ట్స్ నందు విజయకేతనం ఎగురవేసింది. విజేతలైన క్లే మోడలింగ్ – కె తేజ మొదటి స్థానం, ఇన్స్టాలేషన్ – ఆర్ మౌనిక, డి.దేవా రెండవ స్థానం, మెహందీ – ఎస్ సంధ్య, ఎస్ దీప్తి రెండవ స్థానం, రంగోలి – ఎమ్ వీరాంజనేయులు రెండవ స్థానం, పోస్టర్ మేకింగ్ – దేవా మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు, పరిశోధకులు, విద్యార్థిని విద్యార్థులు విజేతలకు అభినందనలు తెలిపారు.

మహిళాభివృద్ధే సీఎం ధ్యేయం

ప్రజాశక్తి -కోట : అన్నీ రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం ధ్యేయమని కోట వెలుగు కార్యాలయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనీలా అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనీలా మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితంగా కాకుండా అన్నీ రంగాల్లో నైపుణ్యత కలిగి వారి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను పెంపొందించుకోవాలని తెలిపారు. పొదుపు సంఘాల సభ్యులు స్వతహాగా వారికి వారే విషయాలను సమగ్రంగా తెలుసుకునేలా ఉల్లాస్ కార్యక్రమం యొక్క విధి విధానాలను వివరిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు అందరకి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా చీర్ల కిరణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ ఉద్యోగ సంఘం నాయకుడు చీర్ల కిరణ్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్జి శ్రీపతి.. ఆదర్శ యువతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఈమె పేరు శ్రీపతి చెన్నై నుండి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువణ్ణామలై దగ్గర జువ్వాది పర్వతశ్రేణుల మధ్య ఉన్న గిరిజన గూడెం వాళ్ళది. తండ్రి కాళిదాస్, తల్లి మల్లిక. కొండప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు. శ్రీపతి కి ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. పిల్లల చదువ కోసం ఆ కుటుంబం దగ్గరలోని ఆ కుటుంబం 'అత్నావర్' అనే పల్లెకు వలస వచ్చింది. వాళ్ళది 'మలయలి' అనే అత్యంత వెనుకబడిన గిరిజన తెగ. ఆ తెగలో అమ్మాయిలను చదివించడం, బయటకు పంపడం పట్ల అనేక ఆంక్షలు ఉంటాయి. కాళిదాస్, మల్లిక దంపతులు వీటిని ఏమీ పట్టించుకోలేదు. శ్రీపతి చదువులో మెరుగుగా రాణిస్తూ.. అందరి కంటే ముందు ఉండడం, ఉన్నత చదువులు చదువుతాను అని పట్టుబట్టడంతో ఆమెను తిరువణ్ణామలైలో "లా" కోర్సు చదివించారు. బంధువుల ఒత్తిడి కారణంగా శ్రీపతికి వెంకట్రామన్ అనే యువకుడితో వివాహం జరిపించారు. పెళ్ళైనా శ్రీపతి చదువు మాత్రం ఆపలేదు. పీజీ చేసి, జూనియర్ సివిల్ జడ్జ పరీక్షకు అప్లై చేసింది. అయితే పరీక్షకు అప్లై చేసేనాటికే తాను గర్భవతిని అని తెలిసింది. సరిగ్గా పరీక్ష తన డెలివరీ ఒకేసారి అయ్యేలాగా ఉందని ఆందోళన చెందింది. తల్లిదండ్రులు, భర్త, గురువు చదువుకోవడం పట్ల దృష్టి పెట్టు.. అంతా మంచే జరుగుతుందని ధైర్యం చెప్పారు. నవంబర్ 27 న శ్రీపతి చక్కటి పాపకు జన్మనిచ్చింది. నవంబర్ 29 న పరీక్ష, రెండ్రోజుల బాలింత, పరీక్ష రాయల్సిన చోటు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నైలో, అయినాసరే పరీక్ష రాస్తానని పట్టుబట్టింది. డాక్టర్లు వారించినా వినలేదు. తన శ్రమ వృధా కాకూడదని వేడుకుంది. తల్లిదండ్రులు భర్త సహకారంతో పసిగుడ్డుతో ప్రయాణం చేసి పరీక్ష వ్రాసింది. సెలెక్ట్ అయ్యింది. ఇంటర్వ్యూ కు అటెండ్ అయ్యింది. ఫిబ్రవరి 15, 2024 నాడు జూనియర్ సివిల్ జడ్జ్‌గా, మొట్టమొదటి గిరిజన మహిళగా అపాయింట్మెంట్ ఆర్డర్ అందుకుంది. అమె ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. పలువురు జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీపతికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్ విజయవంతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పీఈఎస్ విద్యాసంస్థల డిగ్రీ కళాశాలలో కళాశాలలో పనిచేస్తున్నటువంటి అధ్యాపకులు అందరూ జవాబుదారీ జవాబుదారీతనాన్ని కలిగివుండాలని, విద్యాసంబంధ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి అన్నారు. శుక్రవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకులందరూ కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాశాఖకు చెందిన ఇద్దరు అధికారులు డాక్టర్ వినీల, డాక్టర్ మాలతి కళాశాలకు విభాగాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త డాక్టర్ పి.సుజన, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కోటేశ్వరయ్య, వి.వీరయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వాహనాలు నడిపే వారంతా నిబంధనలు పాటించాలని ఉల్లంఘిస్తే అపరాధ రుసుము విధించడంతోపాటు, కేసులు నమోదు చేస్తామని గూడూరు డి.ఎస్.పి గీతా కుమారి పేర్కొన్నారు. శుక్రవారం పోటుపాలెం కూడలి, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల మార్గంలోని మిని బైపాస్ వద్ద ఆమె స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రూరల్ ఎస్సై మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు సంఘం ఊత.. లక్ష్మికి చేయూత

ప్రజాశక్తి - కోట: రెక్కాడితేకాని, డొక్కాడని కుటుంబం. కూలీకి వెళితే అత్త, మామలు, బిడ్డలు అందరూ బతికేందుకు సరిపోని సంపాదన. ఆ స్థితినుంచి పొదుపు సంఘాల ఊతంతో వ్యాపారం ప్రారంభించి, నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్న మహిళ కూరేసి లక్ష్మి. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె విజయ పరంపం ఎందరికో ఆదర్శం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మి కోట మండలం, తిమ్మినాయుడుపాళెం గ్రామంలో నివసించేది. 25 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఆరోజుల్లో రోజు కూలీ 100 రూపాలు తెచ్చి కటుంబ పోషణకు వినియోగించుకునేది. ఆ తర్వాత నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిల తల్లిగా బాధ్యతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో సహచర కూలీలతో పొదుపు సంఘాల గురించి తెలుసుకుని సంఘంలో

లక్ష్మి ప్రారంభించిన వ్యాపారం.. ఇన్ సెట్‌లో నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్న కూరేసి లక్ష్మి

చేరింది. మొదటగా తీసుకున్న అప్పును బాధ్యతగా కట్టింది. కానీ ఆ అప్పు ఇంటి అవసరాలకు సరిపోయింది. మరలా తీసుకున్న అప్పుతో కోటలో చిన్న పటాల అంగడి ప్రారంభించింది. అంచెలంచెలుగా తీసుకున్న అప్పు తీరుస్తూ.. వ్యాపారాభివృద్ధి చేస్తూ.. ఆ షాపు పక్కనే మరో ఫ్యాన్సీ షాపు ప్రారంభించిదం. ఇప్పుడు స్థిర ఆదాయం వస్తునందున పిల్లల చదువు, అత్త మామల ఆరోగ్యం అన్నీ తానే చూసుకుంటే భర్తకు కొండంత ధైర్యమై నిలచింది. మొదట ఆమె అడుగులను అడ్డుకున్న అత్త మామలే ఆమెను మెచ్చుకునేలా చేసుకునింది. పిల్లలకు కూడా వ్యాపారాన్ని చేసుకునేలా వారికి ఒక దారి ఏర్పాటు చేసింది. ఇది ఆమె విజయగాథ. ఒకప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ కూలీకి వెళ్లి తెచ్చుకునే 200 రూపాయలు ఇంటి ఖర్చులకు కూడా చాలని ఓ కుటుంబ స్థితిని కూరేసి లక్ష్మి మార్చేసింది.

దశరథాచారికి వినుత పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుమ్మిడిపూడి దశరథాచారిని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి కోటా వినుత శుక్రవారం పరామర్శించారు. దశరథాచారి సర్జరీ చేయించుకుని రష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వినుత దశరథాచారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కోటా చంద్రబాబు, కావలి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: 33/11 కె.వి సౌత్ సెక్షన్, మాధవ నగర్ సెక్షన్ పరిధిలో 11కె.వి, జీవకోన 11 కె.వి ఏ.ఐ.ఆర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్లను తొలగించుటకు, ట్రీ కట్టింగ్ నిర్వహణకు 8తేది శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అని ఏపి.ఎస్పీ.డి.సీ.ఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ.విన్నకోటిచంద్ర శేఖర్ రావ్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా వైద్య సిబ్బందికి ఘన సన్మానం

మహిళా వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న మన సంస్కృతి సేవా ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) మన సంస్కృతి సేవా ట్రస్ట్ మూడవ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ట్రస్ట్ అద్వర్యంలో చంద్రగిరిలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మహిళా వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి గ్రామ సర్పంచ్ రూపా రామమూర్తి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, బీజేపీ చంద్రగిరి మండల అధ్యక్షుడు పురుషోత్తమ రెడ్డి, ఇందు శేఖర్, ట్రస్ట్ సభ్యులు ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాము జెరిపిటి ట్రస్ట్ సభ్యురాలు కాయం తేజోవతి, ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మనుస్మృతి పేరుతో అణచివేస్తున్నారు

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: 'కేంద్రంలోని బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం మనస్మృతిని అమలు చేస్తూ మహిళలను అణిచి వేస్తోందని, సాక్షాత్తు దేశ ప్రధానిమంత్రి అశాస్త్రీయ భావం వైపు సమాజాన్ని మళ్లించే చర్యలకు పూనుకోవడం శోచనీయం.' అని ఐద్వా జిల్లా ప్రదాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. దేశంలో అధికబాగం ఆకలితో అలమటిస్తున్నారని, గతంలో 107వ స్థానంలో ఉన్న మనం ఇప్పుడు 111వ స్థానానికి దిగజారాం అన్నారు. 2020 నూతన విద్యావిధానం ద్వారా శ్రామిక ప్రజలను చదువుకు దూరం చేశారన్నారు. కరోనా సమయంలో దీపాలు పెట్టండి, ప్లేట్లను గరిటలతో కొట్టండి అంటూ మూఢనమ్మకాలను ప్రోత్సహించారన్నారు. అంగన్‌వాడీలకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలంటే పట్టించుకోవడం లేదన్నారు. విజయమాల్యా 10వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతుంటే పట్టించుకోని ప్రధాని, అదే శ్రామికులు, రైతులు జీవనోపాధికి లక్షో రెండు లక్షల్లో చెల్లించలేకపోతే వేలం వేసే పరిస్థితి ఉందన్నారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా చూస్తూ, వంటింటి కుందేళ్లుగా మార్చేస్తున్నారన్నారు.

వికలాంగునిపై మానవత్వం చూపిన ఎస్ఐ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం ఎస్ఐ అజయ్ కుమార్ శుక్రవారం బీసీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు బందోబస్తుగా వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో వృద్ధుడైన వికలాంగుడు జాతీయ రహదారిని దాటలేక ఇబ్బందులు పడుతూ ఉంటే ఆ దృశ్యాన్ని చూసిన ఎస్ఐ అజయ్ కుమార్ అతనిని కానిస్టేబుల్ సహాయంతో రోడ్డు దాటించారు.

మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి : డాక్టర్ మాధవి, ఫిజియోథెరపి

ప్రజాశక్తి - తిరుపతి : భారతదేశంలో మహిళలు కుటుంబ వ్యవస్థలో అనేక రకాల పనుల్లో నిమగ్నమైవున్నందున వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదన్న వాస్తవం అందరూ అంగీకరించే అంశం. శారీరక శ్రమ, మానసిక శ్రమ, సామాజిక, ఆర్థిక అంశాలు ఆమె ఆరోగ్యం పై ప్రభావం చూపుతున్నాయి. ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి శారీరక శ్రమ అత్యవసరం. ఇది అనేక వ్యాధులను దూరం చేయడంతో పాటు మానసిక ఉల్లాసానికి సైతం తోడ్పడుతుందని ప్రముఖ ఫిజియోథెరపిస్టు, స్విమ్స్ ఫిజియోథెరపి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాధవి తెలిపారు. ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ శారీరక శ్రమ లేని మహిళల్లో అత్యధిక శాతం వ్యాధులకు, మరణాలకు దారి తీస్తున్నట్లు అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. శరీరంలో అన్ని అవయవాలకు శ్రమ అవసరం. వ్యాయామం చేయడం ద్వారా శరీరంలోని అన్ని అవయవాలను ఆరోగ్యంగా మలుచుకోవచ్చు. ఫిట్‌నెస్ కాపాడుకోవచ్చు. కొన్ని రకాల కసరత్తులతో పాటు నడక, పరుగెత్తడం, డాన్సు, సైకిల్ తొక్కడం, కొండలెక్కడం, వాలీబాల్ లాంటి ఆటలు, వయస్సుకు అనుగుణంగా నెమ్మదిగా లేక వేగంగా చేయవచ్చు. ఇంటివద్ద శుభ్రం చేయడం, పశు పోషణ, మొక్కల పెంపకం లాంటి ప్రక్రియలు కూడా వ్యాయామం శరీర ఆరోగ్యానికి తోడ్పడతాయి. మహిళలు వ్యాయామానికి దూరంగా వుండడం వలన వారి ఆరోగ్యం దెబ్బ తింటుంది. సమయం లేదనీ, కుటుంబ సమస్యలనీ, బలహీనంగా వున్నాననీ, అనారోగ్య సమస్యలనీ, ఇలా పలు కారణాలు చెప్పి వారు వ్యాయామానికి దూరంగా వుంటున్నారు. ఫలితంగా నిజంగానే అనారోగ్యం పాలై బలహీనులుగా తయారవుతున్నారు. వ్యాయామం లేకపోవడంతో బరువు పెరగడం, ఫలితంగా డయాబెటిస్, బి.పి, ఎముకలు పెళుసవడం, నరాల బలహీనత లాంటి తీవ్ర జబ్బులకు గురై అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. మహిళా ఆరోగ్యం–దేశ సౌభాగ్యం– మహిళలు తమ ఆరోగ్యాన్ని తామే కాపాడుకోవాలి. ఆరోగ్యమే –మహాభాగ్యం.

శల్య వైద్య పద్ధతుల ప్రెజెంటేషన్‌కు అవార్డు

అవార్డు అందుకుంటున్న శల్య వైద్యులు చంద్రశేఖర్ రాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మైసూరులోని కే ఎల్ ఈ మెడికల్ కాలేజ్, బెల్గాం కర్ణాటకలో జరుగుతున్న 12 వ అంతర్జాతీయ సదస్సులో పుత్తూరు శల్య వైద్యం మీద సమగ్ర ప్రెజెంటేషన్ చేసినందుకు శల్య వైద్యులు డాక్టర్ చంద్ర శేఖర్ రాజుకు ఉత్తమ అవార్డు పొందారు. అదే వేదిక మీద పారాంపర్య వైద్య మహా సంఘం, శ్రీ వెంకటేశ్వరా విశ్వ విద్యాలయం భాగస్వామ్యంతో నిర్వహించు సదస్సు బ్రోచర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో సోమశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాణీ సదాశివమూర్తికి ఠాగూర్ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : కలకత్తాలోని విశ్వ జ్యోతిష విద్యాపీఠంలో ఇండియన్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఓరియంటల్ హెరిటేజ్ సంస్థ 46వ వార్షిక అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను ఈరోజు నుండి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నది. ఈ కాన్ఫరెన్స్‌లో వేద విశ్వవిద్యాలయ విసి ఆచార్య రాణి సదాశివమూర్తి వేద సాహిత్య ధర్మ ప్రచారాలలోచేసిన పరిశోధనలు, కృషిని గుర్తించి విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్మారక అవార్డు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవవర్మ చేతుల మీదుగా ప్రధానం చేశారు.

పాఠశాల అభివృద్ధే నా ధ్యేయం : అన్నామణి

ప్రజాశక్తి - నాయుడుపేట: విద్యార్థుల శ్రేయస్సుకోసం, పాఠశాల అభివృద్ధికోసం నిరంతరం శ్రమించిన ఓ మహిళామణి విజయగాథ ఈ మహిళా దినోత్సవం నాడు ఆదర్శనీయం. మరో నెల రోజుల్లో రిటైర్ కాబోతున్న అన్నామణి ఈ సందర్భంగా తన అనుభవాలు ప్రజాశక్తితో పంచుకున్నారు. నాకెందుకు నేను రిటైర్ అవుతున్నానుకోవడంలోనాకు సంతోషం లేదని అన్నామణి తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీ, లోతువాణిగుంట, ఎల్.ఎ సాగరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తయిందని ఆమె తెలిపారు. ఇన్ని సంవత్సరాలపాటు ఇక్కడే పని చేసి ఇక్కడే రిటైర్ అవుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. తన తపనల్లా విద్యార్థులు, పాఠశాల ఉన్నతి.. పాతదైన స్కూలు భవనంలో విద్యార్థులకు సరిపోయినన్ని తరగతి గదులు లేక పిల్లలు ఎన్నో ఇబ్బందులు పడేవారిని, వారికోసం ఎంతగానో పోరాడి నూతన భవనాలను తెచ్చుకున్నామని తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం పాఠశాలలో అధిక తరగతి గదుల నిర్మాణానికి అగ్రికల్చర్ గోడౌన్ స్థలాన్ని ఇప్పించి, పాఠశాల నిర్మాణానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహకారం మరువలేనిదన్నారు. పాఠశాల అభివృద్ధిలోనే

తనకు ఆనందం ఉందని ఆమె తెలిపారు. 600 మందికి పైగా విద్యార్థి, విద్యార్థినిలు చదువుకుంటున్నారఅన్నారు. ఒక్క నాయుడుపేట మండలంలోనే కాక, చుట్టుపక్కల మండలాల్లోనే ఎంతో శ్రమించి పాఠశాలను ఉన్నత స్థానంలో నిలిపామని చెప్పారు. ఇంకా పాఠశాల భవనాల నిర్మాణ పనులు పూర్తవలేదని ప్రభుత్వ సహకారం అందిస్తే తాను రిటేరయినా పాఠశాల అభివృద్ధి ఆగకూడదని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుత ఎమ్మెలే నెలవల విజయశ్రీ చొరవ చూపి పాఠశాలకు అయ్యే స్టేషనరీ, చిన్న చిన్న కార్యక్రమాలు బిల్లులే కాక భవన నిర్మాణాలకు సహకరించాలని ఆమె కోరారు. వృతి పట్ల నిబద్ధతలో అన్నమణి ఆదర్శమణి కాక మరేమిటి.

దొరస్వామి నాయుడు మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పిఈఎస్ విద్యాసంస్థ అధినేత డాక్టర్ దొరస్వామి నాయుడు బెంగళూరులో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ బెంగళూరుకు వెళ్లి ఆయనకు నివాళి అర్పించారు. ఆయనతోపాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్ర, దొరస్వామి నాయుడుకి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నాణ్యమైన మామిడి దిగుబడికి కవర్లు తప్పనిసరి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ గడ్డంవారిపల్లి గ్రామంలోని సిద్దేశ్వర రైతు సంఘం కలెక్షన్ సెంటర్‌లో మామిడి రైతులకు శుక్రవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనాధికారి దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ మామిడి నిమ్మకాయ సైజులో ఉన్నప్పటి నుంచి కవర్లను వాడితే మంచి నాణ్యమైన మామిడి పంట దిగుబడి వచ్చి మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి శివకుమారి, రైతు సంఘం చైర్మన్ రాజారెడ్డి, కోశాధికారి చిట్టిబాబు, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఈఓ మాధవికి పద్మావతి అవార్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీటీడీలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న మాధవికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకలలో డిప్యూటీ ఈవో ఆనంద్‌రాజు ఏఈఓ మాధవికి పద్మావతి అవార్డును అందించారు.

పద్మావతి అవార్డును అందుకుంటున్న మాధవి

సీనియర్ ఆడిటర్ నాగభూషణం మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ ఆడిటర్ ఎస్. నాగభూషణం మృతి చెందారని, ఆయన మృతి పట్ల తిరుపతి జిల్లా టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోందని అసోసియేషన్ సెక్రటరీ సునీల్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఈశ్వర్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: నెన్నూరు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆ విషయం తెలుసుకున్న భూమన కరుణాకర్ రెడి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, మాజీ ఎంపీపీ అత్తూరి దామోదర్ రెడ్డి, ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి, వైసిపి నాయకులు బి ఓబుల్ రెడ్డి, ఎన్ యోగానంద రెడ్డిలు ఆయనకు నివాళులర్పించారు.

ఆదర్శ మహిళ ఉమామహేశ్వరి

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్
కొండ్రెడ్డి ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - పెళ్లకూరు:
అలుపెరగని విజయ సాధకురాలు, ప్రస్తుతం పెళ్లకూరు మండలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కొండ్రెడ్డి ఉమామహేశ్వరి. ఒక సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి, అలుపెరగని వరుస విజయాలు సాధించుటలో ఆమె ఎంతోమంది మహిళలకు ఆదర్శమని చెప్పాలి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నది ఆమె వ్యవహార శైలిలో కనిపిస్తుంది. 1977 సంవత్సరం డక్కిలి మండలం చాపలపల్లి అనే కుగ్రామంలో ఆమె జన్మించారు. తండ్రి రంగారెడ్డి, తల్లి మనోహరమ్మలు. తన తండ్రి సర్పంచ్. తల్లిదండ్రుల ప్రోత్సాహమే తన విజయానికి కారణమని ఆమె గర్వంగా తెలుపుతున్నారు. ఊరిలోనే ప్రాథమిక విద్యతో ప్రారంభమై 2000 సంవత్సరంలో క్యాంపస్ సెలక్షన్ వరకు ఆమె విజయ పరంపర కొనసాగింది. వెలుగు సిసిగా చిత్తూరు జిల్లా కె.వి పల్లి మండలంలో సీసీగా తన మొదటి ప్రస్థానం మొదలైంది. మొట్టమొదట వడ్డిపల్లిలో తన స్నేహితురాలు గీతాంజలితో కలిసి సుగాలీలు, వడ్డెరలు ఉన్న ఒక తాండ నందు ఎంతో కష్టపడి, ఆలు పెరగని కష్టంతో గ్రామ మొత్తం మీద ఒక్క కుటుంబం తప్ప ఊరు మొత్తం తప్ప తాగి నిరంతరం గొడవలతో ఉండే గ్రామంలో, అలాంటి పరిస్థితుల్లో ఒక నెల రోజులు రాత్రి పగలు అక్కడే ఉండి పొదుపు గ్రూపును ఏర్పాటు చేసి తద్వారా వారిలో మార్పు తీసుకుని వచ్చిన విధానం, ఇప్పుడు తలుచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుందని ఆమె ప్రజాశక్తి ప్రతినిధితో తన అనుభవాన్ని పంచుకున్నారు. తనకు 2021లో వివాహం జరిగిందని తన పిల్లల చదువులు అంతా అడవుల్లోనే కొనసాగాయని ఆమె తెలియజేశారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఆకాష్ బీటెక్ ఫోర్త్ ఇయర్, అక్షర ఇంటర్, భర్త బి.సునీల్ కుమార్ చిత్తూరు జిల్లా స్థాయి అధికారిగా ఎన్ఆర్జిఎస్ ప్రాజెక్టులో పని చేస్తారని తెలియజేశారు. ఉద్యోగ పదోన్నతులలో డిపిఎం, ప్రాజెక్ట్ మేనజర్, ఐసిడియస్ ఫస్ట్ గ్రేడ్ సూర్వైజర్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఆమె విజయాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయి. నాయుడుపేట ఐసిడిఎస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను నేటి తరానికి ఇచే సదేశం అడుగగా ఇష్టంతో కష్టపడితే విజయం వరిస్తుందని, ప్రతి ఒక్కరూ పాజిటివ్ థింకింగ్‌తో ముందుకు వెళ్లాలని తెలియజేశారు.

ఆచార్య దేవప్రసాదరాజుకు అమెరికా ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ ప్రొఫెసర్ బి. దేవ ప్రసాదరాజుకు అమెరికా నుంచీ ఆహ్వానం అందింది. అమెరికాలోని బోస్టన్ లో నవంబర్ 3 వ తేదీ నుంచీ మూడు రోజుల పాటు 6 వ ఆప్టిక్స్, పొటానిక్స్ అండ్ లేజర్స్ అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. యునైటెడ్ సైంటిఫిక్ గ్రూపు ఆధ్వర్యంలో ఈ సదస్సు చేపట్టనున్నారు. ఈ మేరకు యునైటెడ్ సైంటిఫిక్ గ్రూప్ ప్రెసిడెంట్ డాక్టర్ కిన్నెత్ బ్లమ్ నుంచీ ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు ఆహ్వానం అందింది.ఈ సందర్భంగా ప్రొఫెసర్ దేవప్రసాదరాజును పలువురు అభినందించారు.

విద్యార్థులతో
స్నేహపూర్వకంగా మెలగాలి

ప్రజాశక్తి -కోట : ప్రతి విద్యార్థి పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నదే తమ ఉద్దేశమని కోట ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ టి.ఉషారాణి అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని స్థానిక ఎస్సీ హాస్టల్ పరిధిలో ప్రజాశక్తితో మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో చదువుకునే పిల్లలతో కలిసి మెలిసి స్నేహభావంతో విద్యార్థినీలకు అన్నీ సౌకర్యాలను కల్పిస్తూ చదువుపై ఆసక్తి పెంచుకునే విధంగా మోటివేషన్ చేస్తున్నామన్నారు. పలు ప్రాంతాల నుండి హాస్టల్లో చేరిన విద్యార్థుల పట్ల ప్రేమ, అభిమానం,వాత్సల్యం చూపడం జరుగుతుందన్నారు. విద్యార్థినులకు మంచి పౌష్టికాహారం అందిస్తూ వ్యక్తిగత విషయాల పట్ల ప్రతిఒక్కరూ ముందుస్తూ అవగాహన కలిగి ఉండాలని విద్యార్థినీలకు తెలియజేస్తూ ఉంటామన్నారు.ప్రధమంగా 2005 సంవత్సరంలో మహమ్మదాపురం బాలికల హాస్టల్‌లో జాయిన్ అయ్యానని తెలిపారు. అనంతరం కలువాయి, పొదలకూరు,చిట్టేడు ప్రాంతాల్లో వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ గా విధులు నిర్వర్తించి ప్రస్తుతం కోట ఎస్సీ బాలికల వసతి గృహంలో విధులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

అడ్మిషన్లకోసం
కార్పొరేట్ స్కూళ్ల తహ తహ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అన్నమయ్య భవనంలో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ కుమార్, చిన్నా మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కాకముందే తిరుపతి జిల్లాలో ఉండేటువంటి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తూ తిరుపతిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందస్తు ప్రచారాలు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ నారాయణ, చైతన్య కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎ నాయకులు వేణు, రంజిత్, వంశీ, కృష్ణ వంశీ, సురేంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈనెల మూడో తారీకు నుంచి ఏడవ తారీఖు వరకు ఢిల్లీ అమిట్ యూనివర్సిటీ నోయిడాలో జరిగినటువంటి 38వ జాతీయ యువజన ఉత్సవాలలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు పాల్గొని బహుమతులను సాధించారు. ఈ బహుమతులు పొందిన వారిలో ప్రణ్షుష, ప్రత్యూష, మౌనిక, భాను చంద్రజ్యోతి, మీనా భాను, శివనిమరియు రాచమరెడ్డి కీర్తి మైమ్ విభాగంలో విజేతలు అయ్యారు. స్కిట్ విభాగంలో నీలిమ, సత్య భార్గవి సువర్ణేశ్వరి, సాత్విక, నిహారిక మరియు నిహారిక విజేతలయ్యారు. ఎలక్యూషన్‌లో పాల్గొని ఐదవ బహుమతిని ప్రగతి జైస్వాల్ సాధించారని, కల్చరల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి తెలిపారు.

ఘనంగా శ్రీవిజ్ఞాన్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీ విజ్ఞాన్ హై స్కూల్ 29వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆ స్కూల్ కరస్పాండెంట్ ఆంధ్రా జనార్దన్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణింపు కీలకం అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెవెన్ హిల్స్ స్కూల్ కరస్పాండెంట్ హరణాధ శర్మ, నలంద హై స్కూల్ కరస్పాండెంట్ ఓబుల వెంకటరమణ రెడ్డి, విశ్వం హై స్కూల్ అధినేత విశ్వనాథరెడ్డి, బి సి ఎం హై స్కూల్ కరస్పాండెంట్ ప్రియ, ఎస్వీ మ్యూజిక్ కాలేజ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు వచ్చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది

ప్రజాశక్తి - తిరుపతి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిఐటియు ఐద్వా ఆధ్వర్యంలో వేమన విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోజా రమణి ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి సోనిక అడ్వకేట్ ఏ పద్మజ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి బుజ్జి హాకర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం జయంతి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వాణిశ్రీ అడ్వకేట్ శ్రీదేవి కార్పోరేటర్ లక్ష్మీ ఆశా వర్కర్స్ జిల్లా కార్యదర్శి కందారపు మురళి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిలు ముఖ్యవక్తులుగా సభలో ప్రసంగించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని టీడీపీ కూటమి మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ నెలకు 1500 వంటి హామీలు ఇచ్చిన వాటి అమలు గురించి స్పష్టత లేదన్నారు. 33 శాతం రిజర్వేషన్ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో కుటుంబ ఆధిపత్యం కొనసాగుతుందని స్త్రీలకు అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ భూముల ఆక్రమణల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్

ప్రజాశక్తి - రామచంద్రపురం: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నూతుకుంటపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని వచ్చిన సమాచారం మేరకు భూములను పరిశీలించారు. భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. మండలంలో అక్రమ గ్రావెల్ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ టీములు విస్తృతంగా తనిఖీలు చేయాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కమ్యూనిటీ సర్వేయర్ మణి, వీఆర్ఏలు బాలు, గీత తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మహతి ఆడిటోరియంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుమలలో అటవీ ఏనుగుల సంచారం

మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ఏనుగులు సంచరించాయి. ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు అటవీ శాఖ సిబ్బంది, విజిలెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు.

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి: తహశీల్దారు

వికోట తహశీల్దారు పార్వతి

ప్రజాశక్తి -వి కోట : మహిళలు కష్టపడి స్వయంకృషితో ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని వీకోట తహశీల్దార్ పార్వతి తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పరిష్కరించుకుని శుక్రవారం వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ధైర్యంగా తమ విధుల్లో పురుషులతో సమానంగా రాణించాలని ఒక మహిళగా తాను పిలుపు నిచ్చారు. ప్రతి మహిళ గృహిణిగా తమ కుటుంబాన్ని పోషించే స్థాయిని కలిగి ఉండాలని స్త్రీలు విద్యావంతురాలు అయితేనే తమ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దగలుగుతారన్నారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ కనిపరచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించి క్రమశిక్షణతో మెలగి మానసిక ప్రశాంతతను మనోధైర్యాన్ని పెంపొందించుకొని విజయం దిశగా వెళ్లాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత దశలో ప్రతి మహిళ అన్ని జాగ్రత్తలు పాటించి ముందుకెళ్లాలని సూచించారు. తాసిల్దారుగా పలు జిల్లాల్లో క్రమశిక్షణతో పని చేయడం, ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చడంతో తాను చేసిన కృషికి జిల్లా ఉన్నతాధికారుల నుండి పలు అవార్డులు అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో దళిత ,పేద ,బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ సేవలను అందించడంలో చేసిన కృషికి రాష్ట్రస్థాయి అవార్డులు వారు అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అనునిత్యం తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ మహిళా ఉద్యోగులు గృహిణిగా, తల్లిగా తన కుటుంబాలకు తగిన సమయం కేటాయించాలని సూచించారు. ప్రతి మహిళ మానసిక ప్రశాంతత కలిగి ధైర్యంగా, పట్టుదలతో తమ ఎదుట ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని వివిధ రంగాల్లో ముందుకెళ్లేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేతో కలిసి చెక్కులు పంపిణీ చేస్తున్న ఏపీఎం లావణ్య

పొదుపుతోనే మహిళల అభివృద్ధి: ఏపిఎం

ప్రజాశక్తి -వి కోట : స్వయం సహాయక సంఘాలు ఆర్థిక అభివృద్ధి సాధించి పొదుపులు అలవర్చుకున్నప్పుడే మహిళలు ఆర్థిక శక్తిగా ఎదుగకలుగుతారని ఏపిఎం లావణ్య తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలందరికీ జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 1989 స్వయం సహాయక సంఘాలలో19,882 మంది మహిళలు సభ్యులుగా కొనసాగడం గర్వకారణం అన్నారు. మహిళా సంఘాలు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. సంఘ సభ్యులు పొదుపులను అలవర్చుకొని బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఉపాధి మార్గాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు తమ జీవితాలకు స్థిరమైన ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. సంఘంలోని ప్రతి మహిళా సభ్యురాలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని మహిళా సంఘం సభ్యులు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడం ద్వారా తన కుటుంబాలను ఉన్నతంగా నిలిపేందుకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత మహిళల్లో సామాజిక ఆర్థిక పరంగా ఎదిగేందుకు పొదుపులు అలవర్చుకోవడం ఆదర్శప్రాయం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న దశలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి ధైర్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న అత్యాచారాలు, వివక్షతను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని కోరారు. మహిళలు గౌరవంగా ధైర్యంగా ఎదిగేందుకు తమ ముందున్న అవకాశాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మహిళా దారుణ హత్యకు గురైన ఘటన శుక్రవారం తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు కోలా వీధి, చిన్నగుంట మోక్షిత నిలయం, రెండవ అంతస్తులో ఎర్రవారిపాలెం మండలం, బండమీద కమ్మపల్లికి చెందిన గోపాల్ రెడ్డి, ప్రమీలమ్మ కుటుంబం 30 సంవత్సరాలగా నివాసం ఉంటున్నారు. గోపాల్ రెడ్డి ప్రమీలమ్మ దంపతులకు కవిత, గాయత్రి, రోజా కుమార్తెలు, నవీన్ కుమారుడు వున్నారు. ప్రమీలమ్మ దంపతులు చిన్న కూతురు రోజా వద్ద వుంటున్నారు. శుక్రవారం సాయంత్రం ప్రమీలమ్మ హత్యకు గురైంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీలత, వెస్ట్ సీఐ మురళీమోహన్రావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చిన్న కూతురు రోజా భర్త రవి నాయక్ అత్త దగ్గర వున్న నగదు కోసం హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమితం మృతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు రవి నాయక్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమంత వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఆవుల పల్లె గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారు హనుమంత వాహనము పై పురవీధులలో ఊరేగారు. ఉదయం మూల విరాట్ కు అభిషేకాలు పూజలు నిర్వహించారు.

విధులు చేపట్టి నాలుగు నెలలే..రాష్ట్ర అధికారుల ప్రశంసలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఆమె విధులు చేపట్టి నాలుగు నెలలే అవుతోంది.. ఏపీ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ చింత విజయ్ ప్రతాప్ రెడ్డి ఎస్ఆర్పురం మండలానికి పర్యటనకు వచ్చినప్పుడు 49 కొత్తపల్లి మిట్ట దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పోషణ వాటిక (కిచెన్ గార్డెన్) పెంచిన విధానం పండించిన పనితీరు చూసి కితాబు ఇచ్చారు. ఎంపికైన అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ వాటికను ఇలాగే అభివృద్ధి చేయాలని అన్ని పాఠశాలలో కొనసాగాలని కార్వేటి నగరం ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మ సునంద దిశ నిర్దేశం చేశారు.

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట పరిధిలోని కొత్తపల్లి దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రం వుంది. ఇందులో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు వేదమణి అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా అధికారులు ఖాళీగా ఉన్న స్థానాలను గుర్తించి ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. దీంతో దివ్య 17 అక్టోబర్2024 తేదీలో అంగన్‌వాడీ పాఠశాలలో విధులలో చేరారు. అప్పటి నుంచి ఆమె ఆ స్కూలుకు ఏదో చేయాలని మనసులో గట్టి సంకల్పం చేసింది.

పాఠశాల అభివృద్ధి ఇలా..

ఆ పాఠశాలలో 12 మంది ప్రీ స్కూలు పిల్లలు ఉన్నారు. ఈ పిల్లలకు పోషణ వాటిక (కిచెన్ గార్డెన్) పై కార్వేటి నగరం ప్రాజెక్ట్ లో సిడిపిఓ పద్మ సునంద ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. దీంతో ఆమె కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఉన్న పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయురాలు దివ్య తమ భర్త సహకారంతో పాఠశాల ఆవరణలో శుభ్రం చేయించి పాదులు తీసి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల చెట్ల సాగుకు ప్రణాళిక వేసింది. ఇందులో భాగంగా టమోటా, వంగ, బెండ, చిక్కుడు అలసందులు, సిర్రాకు, పాలకూర, చుక్కకూం, కొత్తిమీర, గోంగూర , మిరప మొదలగు పంటలను సాగు చేసింది. అంతా రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం చేసింది. ప్రీస్కూల్ పిల్లలకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు ఆకు కూరలతోనే వంటలు చేసి పిల్లలకు పెడతారు. గర్భవతులకు, బాలింతలకు ప్రీ స్కూల్ విద్యార్థులు తల్లిదండ్రులకు పోషణ ప్రాముఖ్యతను వారికి వివరించి వారి ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్‌కు అవగాహన కల్పిస్తున్నారు.

దివ్య, అంగన్వాడి టీచర్

స్టాక్ రిజిస్టర్ ఇదే తరహాలో అమలు చేయాలి

ఆహార భద్రత తనిఖీలో భాగంగా ఈనెల మూడవ తేదీ సోమవారం ఎస్ఆర్పురం మండలంలో ఏపీ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ చిత విజయ్ ప్రతాపరెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక ను పరిశీలించారు. లబ్ధిదారులకు అందించిన ప్రతి వస్తువుల దగ్గర లబ్ధిదారుల సంతకం తీసుకొని స్టాకు రిజిస్టర్ మెయింటినెన్స్ చేయడం, పోషణ వాటిక లో పండించిన ఆకుకూరలో కూరగాయలను చూసి అంగన్‌వాడీ టీచర్ దివ్య పనితీరు చాలా బాగుందని చిత్తూరు ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, కార్వేటి నగరం ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మ సునంద లను ప్రశంసించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో అమలు చేయాలి.

- చిత్ర విజయ్ ప్రతాపరెడ్డి, ఏపీ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్.

అంగన్‌వాడీ కార్యకర్తలు ఇలా ముందుకు రావాలి

కార్వేటి నగరం ప్రాజెక్ట్ పరిధిలో వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం, కార్వేటినగరం మండలాలు ఉన్నాయి. ఎస్ఆర్ పురం మండలానికి సంబంధించి 62 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 38 పోషణ వాటిక (కిచెన్ గార్డెన్స్) కు ఎంపికైన కేంద్రాలలో ప్రకృతి వ్యవసాయంలో పండించడానికి ప్రత్యేక దృష్టి సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ, గర్భవతులకు, బాలింతలకు ప్రీ స్కూల్ పిల్లలకు మంచి న్యూట్రిషన్స్ వాల్యూస్ ఆకుకూరలు, కూరగాయలను అందించడమే లక్ష్యంగా వారి ఆరోగ్యంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఆర్ పురం మండల పరిధిలో ఉన్న మెయిన్ సెంటర్లు, మినీ సెంటర్ల కార్యకర్తలు పోషణ వాటికను (కిచెన్ గార్డెన్) ఎంపికైన సెంటర్లలో రసాయన రహిత ఆకుకూరలో కూరగాయలను పండించి మొదటి విడత లో గర్భవతులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలకి పెట్టారు. అంగన్వాడి కార్యకర్తలందరూ పిల్లలకు రసాయన రహిత ఆహారాన్ని అందించడానికి ముందుకు రావాలి.

- పద్మ సునంద, కార్వేటినగరం ప్రాజెక్టు సిడిపిఓ.

ప్రశంసిస్తున్న ఏపీ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ చింత విజయ్ ప్రతాప్ రెడ్డి

అభివృద్ధికి సలహాలివ్వాలి

నేను అంగన్‌వాడీ కార్యకర్తగా విధుల్లో చేరి నాలుగు నెలలుగా అవుతోంది. సూపరింటెండెంటు ఆఫ్ ఇంజనీర్ పంచాయతీరాజ్ చిత్తూరు స్పెషల్ ఆఫీసర్, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి మా అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ నేపథ్యలో నేను విధులలో చేసే పొరపాట్లను , యాప్‌లు, రికార్డులను ఎలా రాసుకోవాలో కార్వేటి నగరం ప్రాజెక్టు సిడిపిఓ పద్మ సునంద , సూపరువైజర్ సందర్శించినప్పుడల్లా సరిదిద్దారు. వారి సూచనలు, సలహాలు పాటించాను.

- దివ్య,అంగన్వాడి టీచర్, కొత్తపల్లి మిట్ట , ఎస్ఆర్ పురం.

మహిళా శక్తి ప్రపంచానికే ఆదర్శం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగము ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సంయుక్తంగా శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాలలో పురుషులకు సమానంగా రాణిస్తున్నారని, శ్రీ శక్తి ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మహిళా డాక్టర్లు గైనకాలజిస్ట్ డాక్టర్ కీర్తి, అనస్థటిస్ట్ డాక్టర్ శృతి, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శృతి భాగ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డ్రాయింగ్ పెయింటింగ్ కాంపిటీషన్లో ఉత్తీర్ణులైన విద్యార్థినిలు ఎం జ్ఞాన ప్రసన్న, ఎన్ మానస, మీ పూర్ణిమ లకు బహుమతులు అందజేశారు. అనంతరము కళాశాల తరపున మహిళా అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సిఎన్ లతా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి తదితర అధ్యాపకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టరు ప్రవీణ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితే దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టిగా ఉంటుంది. మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలి. సమాజం వారిని గౌరవించాలి. ఆదర్శంగా ఉండాలి. సమాజంలో మహిళలు ఎంతో కీలక పాత్ర వహిస్తున్నారు. దేశ రాజకీయాలలో రాణిస్తున్నారు. మహిళలు ఎదిగేటందుకు సమాజంలో ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలన్నారు.

ఎస్ఆర్పురం: ప్రస్తుత సమాజంలో మహిళలు ప్రతి చిన్న విషయానికి అతిగా ఆలోచిస్తూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అలా కాకుండా ప్రతి విషయాన్ని కూలంకషంగా సమీక్షించి అడ్డుకోవాలని ఆత్మ స్థైర్యంతో జీవితంలో ఉన్నత స్థానాలు లకు ఎదగాలని పెద్దతయ్యూరు, ఎస్ ఆర్ పురం మండలం వెటర్నరీ డాక్టర్ శ్రీవిద్య అన్నారు. సమాజంలో అసమానతలు లేకుండా పురుషులతోపాటు స్త్రీలకు రిజర్వేషన్లు కేటాయిస్తూ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తెస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరుపుకోవడం మహిళను గుర్తించడం మహిళల ఎదుగుదలకు మెట్లు అన్నారు. దీనిని ప్రతి మహిళల సద్వినియోగం చేసుకోవాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి: డీఎస్పీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి,మాల్ ప్రాక్టీస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం కార్వేటినగరంలో ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సీ.ఐ హనుమంతప్పతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో భాగంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరకుండా ఇన్విజిలేటర్లు చూడాలని, స్కాడ్ అధికారుల తనిఖీల్లో విద్యార్థులు పట్టుబడితే ఆ పరీక్షా కేంద్రంలోని ఇన్విజిలేటర్పై చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వచ్చే ముందే క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ రాజ్కుమార్, కళాశాల. ప్రిన్సిపాల్ స్వరూప. ఏ ఎస్.ఐలు మునికృష్ణ, గోవిందస్వామి పాల్గొన్నారు.

గుంతలకు ప్యాచ్ వర్క్

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల నుండి నంజంపేట మీదుగా పెద్ద ఉప్పరపల్లె వరకు గుంతల మయమైన ప్రధాన రహదారిని ప్యాచ్ వర్క్ కింద తారు పరచి గుంతలు లేకుండా చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అధ్వానంగా తయారై పూర్తిగా గుంతల మయమై రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న ఈ మార్గాన్ని కూటమి ప్రభుత్వం రాగానే ప్యాచ్ వర్క్ కింద గుంతలు పూడ్చి రోడ్లు బాగు చేయాలని ఆదేశించడంతో నెల రోజుల క్రితం గుంతలు ఉన్నచోట కంకర పరిచి చదును చేశారు. గత మూడు రోజులుగా కంకర పరిచిన ప్రాంతాలలో తారును వేసి రోడ్డు రోలర్తో తొక్కించి గుంతలు లేకుండా ప్యాచ్ వర్క్ చేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఒకింత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీని నా ఇల్లులా భావించాను

ఉత్తమ సర్పంచి, సుభాషిణి

చెర్లోపల్లి పంచాయతీని అభివృద్ధిపథంలో నడపాలని ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లుతున్నాను. పంచాయతీని నా ఇళ్లులాగే భావించి, అభివృద్ధి చేస్తున్నానని ఉత్తమ సర్పంచి అవార్డు గ్రహీత సుభాషిణి తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గుంటూరు జిల్లా మునిపల్లికి చెందిన సీతామహాలక్ష్మీ, సాంబశివరావు దంపతులకు సుభాషిణి ఏకైక కుమార్తె. నాన్న ఉద్యోగరీత్యా పలు ప్రాంతాల్లో చదువుకోవాల్సి వచ్చింది. బదిలీలో బాగంగా నాన్న తిరుపతికి రావడంతో, ఇక్కడే స్థిరపడ్డాం. ఎలక్ట్రానిక్స్‌లో డిప్లమా పూర్తి చేశాను. నాన్న స్ఫూర్తితో చిన్నతనం నుంచి సమాజానికి నా వంతు సహయం చేయాలని భావించేదాన్ని. నాన్న రిటైర్డు అయిన తర్వాత సొంతంగా ఇళ్లు నిర్మించాలని తలిచాడు. రిటైర్డు నిధుల్లో నుంచి కొంత సొమ్ము నాకు ఇచ్చి ఇల్లును నువ్వే దగ్గరుండి నిర్మించు అని నాకొక పరీక్ష పెట్టాడు. నాన్న ఇచ్చిన డబ్బులను వృథా చేయకుండా అందులోంచి కొంత మిగిల్చి ఇళ్లు పూర్తి చేశాను. అప్పుడు నాన్న నన్ను మెచ్చుకుని, భవిష్యత్తులో మరింత రాణిస్తావని దీవించాడు. బొల్లినేని శుభగిరి నాయుడుతో వివాహం తర్వాత చెర్లోపల్లిలో కాపురం ఉంటున్నాం. భర్త కాంట్రాక్టరు కావడంతో ఇంటి బాధ్యత మొత్తం నేను చూసుకునేదాన్ని, భర్త నన్ను బాగా ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సహంతో చెర్లోపల్లి సర్పంచిగా గెలుపొందాను. 30 సంవత్సరాలుగా పంచాయతీలో ఓటు వేసేదాన్ని, కానీ నేను సర్పంచిగా పోటీ చేసే సమయానికి నాది, నాకుటుంబ సభ్యుల ఓట్లు గల్లంతయ్యాయి. దీన్ని న్యాయపోరాటం చేసి, కోర్టు ద్వారా ఓటు హక్కును సంపాదించుకున్నాను. అదే ధైర్యంతో సర్పంచిగా పోటీ చేసి గెలుపొందాను. తాను సర్పంచిగా గెలిచినప్పుడు పంచాయతీ రెవిన్యూ 30 లక్షలు. దీంతో పెద్ద ఎత్తున అభివృద్ధి చేయలేం. ముందు పంచాయతీకి రెవిన్యూ పెంచాలని బావించాను. పంచాయతీలో షాపింగ్ కాంప్లెక్ నిర్మించి టెండర్ల ద్వారా షాపులు కేటాయించడంతో రెవిన్యూ పెరిగింది. దీంతో యుడిఎస్, సిసి రోడ్డులు, స్ట్రీట్ లైట్లు, ఫ్యామిలీ పార్క్, సమావేశమందిరం నిర్మించాం. పంచాయతీని అభివృద్ధి పథంలో నిలిపాం. తాను చేసిన అబివృది చూసి కేంద్ర ప్రభుత్వం ఉత్తమ సర్పించి అవార్డును అందజేసింది. ఈ అవార్డు నాలో మరింత బాద్యత పెంచింది. ప్రతి మహిళా ధైర్యంగా ఉండాలి. తాను చేయదలుచుకుంది నిర్బయంగా వెల్లడించాలి. అప్పుడు సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. మహిళలందరికి శుభాకాంక్షలు.

చదువే గౌరవాన్ని పెంచుతుంది

భవాని, బ్యాంక్ మేనేజర్

చదువు ప్రతి మనిషి గౌరవాన్ని పెంచుతుంది. దాన్ని బలంగా నమ్మి, చదువుపై దృష్టి పెట్టడంతో నేను బ్యాంకు అధికారినయ్యాను. అంటూ తిరుపతిలోని ఓ జాతీయ బ్యాంకు మేనేజరు భవాని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడుతూ నేను ఓ సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించాను. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో అమ్మే నన్ను, తమ్ముడిని అన్ని తానై పెంచింది. మమ్మల్ని పెంచేందుకు అమ్మ చాలా ఇబ్బందులు పడింది. వ్యవసాయ పనులు చేస్తూ మమ్మల్ని పోషించింది. చిన్నతనం నుంచే నేను అమ్మకు చేదోడు వాదోడుగా ఉండేదాన్ని. బాగా చదువుకుని మంచి స్థాయికి రావాలని, అమ్మచెప్పిన మాటలు నాలో బలంగా నాటుకుపోయాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా చదువుపై అశ్రద్ధ చేసేదాన్ని కాను. కష్టపడి చదువుకుంటూ 2012 మేలో ఎంబిఏ పూర్తి చేశాను. అదే ఏడాది సెప్టెంబరులో జాతీయ బ్యాంకులో అసిస్టెంట్ బ్యాంకు మేనేజరుగా ఉద్యోగం వచ్చింది. 2014లో సాఫ్ట్‌వేర్‌ను వివాహం చేసుకున్నాను.ఇద్దరు పిల్లలు. మొదటిలో మా అమ్మ, ఇప్పుడు మా అత్తయ్య సహాయ సహకారాలతో ముందుకెళ్లుతున్నాను. భర్త ప్రోత్సాహం మరువులేనిది. తిరుపతిలో విధులు నిర్వహిస్తున్నాను.